ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 23, 2016

బా..బా...
బ్లాక్ మనీ

అవాలూ హూ..

సాంస్కృతికంగాను, భౌగోళికంగాను అక్కడక్కడ పోలికలు కనిపించే చైనాకు సాహిత్య, కళా రంగాల వారధి ఎప్పటి నుంచో ఉంది. హిందీ చిత్రాలకు చైనాలోను ఆదరణ ఉంది. అలా హిందీ చిత్రాలను వారు, వారి మార్షల్ ఆర్ట్స్ చిత్రాలను మనం చూస్తునే ఉన్నాం. తారలను ఆదరిస్తూనే ఉన్నాం. ధూమ్-3, 3-ఇడియట్స్, పికె వంటి చిత్రాలు మన దేశంతో పాటు చైనాలోనూ విజయవంతమయ్యాయి. గతేడాది చైనాలో 4500 స్క్రీన్‌లపై రికార్డు స్థాయిలో విడుదలై ఘన విజయం సాధించింది బాలీవుడ్ చిత్రం పి.కె.. ఇది 114.91 కోట్ల వసూళ్లతో పెద్ద హిట్ చిత్రంగా నిలిచిపోయింది. బాలీవుడ్ చిత్రాల్నే కాదు.. సినిమా పాటల్నీ చైనా యువత ఎక్కువగా ఇష్టపడుతోంది. షారుక్ నటించిన మొన్నటి 'దిల్ సే'లోని ఛయ్య ఛయ్య, యువతను ఉద్వేగాల్లో తడిపిన 'ఆషికి-2'లోని 'హమ్ తేరే బిన్ రెహ నహి సక్తే...' వంటి ఎన్నో పాటలు చైనా యువత మొబైల్ రింగ్‌టోన్స్‌గా మారాయి. అంతెందుకు చిరంజీవి 'దొంగ' చిత్రంలోని 'గోలీమార్..' తెలుగు పాటను కూడా అక్కడి టీవీ డ్యాన్స్ ప్రోగ్రామ్‌లో చైనా యువత పాడుతూ స్టెప్పులేస్తూ అదరగొట్టేసింది. ఇంత ప్రభావవంతంగా సినిమా ఉంది కనుకే ప్రస్తుతం ఆనాటి క్లాసిక్ చిత్రం 'ఆవారా'ను చైనా షాంఘై కళోత్సవం సందర్భంగా థియేట్రికల్‌గా పునర్నిర్మించనున్నారు. 1951లోనే చైనాలో విడుదలైన 'ఆవారా' చిత్రం భారీ ఆదరణకు నోచుకుంది. 'ఆవారాహు...' టైటిల్ సాంగ్ చైనీయుల మనసు దోచుకుంది. అక్కడది 'అవాలూ హూ...'గా చార్ట్ బస్టర్‌గా నిలిచిపోయింది. మాండరిన్‌లో 'ర' ఉండదు దాన్ని 'ల'తో పలుకుతారు. 65 ఏళ్లలో అంతటి ప్రభావాన్ని చూపిన సినిమా మరొకటి లేదు. ఇప్పటి తరానికి ఆ చిత్రాన్ని కొత్తగా పరిచయం చేసి సాంస్కృతిక, కళా వారధి మరింత బలపడే ప్రయత్నం చేస్తున్నారు.

'ఆవారా'లో రాజ్‌కపూర్

వివరం

145 డిగ్రీల స్టూడెంట్ నెం.1

ఎవరైనా విజిటింగ్ కార్డ్ ఇవ్వగానే పేరు, అడ్రస్ తర్వాత మనకి కనిపించేది విద్యార్హత. చదువంటే చెవికోసుకునే కొందరు ఐదారు డిగ్రీలు పూర్తి చేసేస్తూ వాటిని విజిటింగ్ కార్డులపై చేర్చేస్తుంటారు. ఇలాంటివన్నీ అసాధారణ ప్రతిభనుకుంటే అంతకు మించిన పట్టుదలతో వందలాది డిగ్రీలని పూర్తిచేస్తే విజిటింగ్ బుక్ మోసుకెళ్లాలేమో..! డిగ్రీలతో ఒకటిన్నర శతకం బాదేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు చెన్నయ్‌కి చెందిన విఎన్ పార్థివన్(55). ఈ స్టూడెంట్ నెం.1 గురించి తెలియాలంటే పేరు పక్కన క్యూ కట్టిన డిగ్రీల పేర్లన్నీ చదివే ధైర్యం చేయకండి. ఎందుకంటే ఒకటా రెండా వివిధ విభాగాల్లో మొత్తం 145 డిగ్రీలు పూర్తిచేసాడీ అసామాన్యుడు.

ఒక్క మాస్టర్ డిగ్రీ పూర్తి చేస్తే చాలు కాలరెగరేస్తుంటారు చాలా మంది. పేరు తర్వాత డిగ్రీలని చేర్చడం కొందరి ఫ్యాషనైతే చదువుపై ప్యాషన్‌తో వివిధ కోర్సుల్లో డిగ్రీలు పూర్తి చేసేస్తుంటారు ఇంకొందరు. అలా సదరు వ్యక్తి విజిటింగ్ కార్డ్‌లో పేరుతో పాటు ఒకటి రెండు డిగ్రీలూ చేరిపోతుంటాయి. పదుల సంఖ్యలో డిగ్రీలున్న విజిటింగ్ కార్డులు, నేమ్‌బోర్డులు కాస్త అరుదుగానే కనిపిస్తాయి. అలాంటిది విజిటింగ్ కార్డ్‌పై వందల సంఖ్యలో డిగ్రీలు కనిపిస్తే ఒక్క క్షణం విస్మయానికి గురవక తప్పదు. చెన్నయ్‌లోని వివిధ కళాశాలల్లో పార్థివన్ సెమినార్లు, ప్రసంగాలకి హాజరయ్యే విద్యార్థులు ఇప్పుడు అలాంటి విస్మయానికే గురవుతున్నారు. పార్థివన్ పేరు కంటే తను పూర్తిచేసిన డిగ్రీలే అక్కడ హైలెట్. 30 ఏళ్లలో వివిధ విభాగాల్లో 145 డిగ్రీలని పూర్తిచేశాడు పార్థివన్. అందరూ అతన్ని అసాధారణ ప్రతిభావంతుడంటుంటే ప్రతిభ కంటే పట్టుదలే తనని ముందుకి నడిపిస్తోందంటున్నారతను. చెన్నయ్‌లోని ఒక సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి పార్థివన్. చాలా మంది యువతలా తనూ కాలేజీ రోజుల్ని విలాసవంతంగానే గడిపేవాడు. అయితే తొలి డిగ్రీని పూర్తిచేయడం తనకెంతో కష్టతరమైంది. ఉద్యోగం కోసం ఎలాగోలా డిగ్రీ పూర్తిచేయాలనుకున్నాడు పార్థివన్. అనుకున్నట్టే చదువు పూర్తిచేసి న్యాయ శాఖలో ఉద్యోగం పొందాడు. అప్పుడే తనకి తెలియని విషయాలని తెలుసుకోవాలనే ఆసక్తి ఎక్కువైంది. చదవడమంటే ఏదోలా చదివేయడం కాదు విషయాన్ని ఆసాంతం తెలుసుకోవాలి. తెలుసుకున్న విషయాల్ని పేపర్‌పై పెట్టాలి. అప్పుడే ఎలాంటి చదువైనా తేలిగ్గా పూర్తి చేయగలం. ఒకప్పుడు తనకి కష్టమనిపించిన చదువునే ఇష్టంగా కొనసాగించాలనుకున్నాడు. మొదట స్వల్పవ్యవధిలో పూర్తయ్యే డిప్లొమా కోర్సులతో తన చదువుని ప్రారంభించాడు పార్థివన్. ఒక్కో డిగ్రీ పూర్తిచేస్తూ మరో కొత్త డిగ్రీ ప్రవేశానికి ప్రణాళిక సిద్ధం చేసుకునే వాడు. చదువుపై మరింత ఆసక్తి పెరగడంతో ఉద్యోగం, చదువు రెండూ భారమనిపించలేదతనికి.

వృత్తి కూడా చదువే

పూర్తి సమయం విద్యాసంబంధిత విషయాలకే కేటాయించాలనుకున్న పార్థివన్ చెన్నయ్‌లో ఒక ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. సాధారణంగా ఉద్యోగస్తులందరూ ఆదివారం వచ్చే సెలవు కోసం ఎదురుచూస్తుంటారు. పార్థివన్ మాత్రం సెలవు రోజుల్లోనూ రీసెర్చ్ పనుల్లో, పరీక్షలు రాయడంలో తలమునకలౌతుంటాడు. 12 రీసెర్చ్ డిగ్రీలు, న్యాయశాస్త్రంలో 8 మాస్టర్ డిగ్రీలు, 10 ఆర్ట్స్ కోర్సుల్లో మాస్టర్స్, 8 కామర్స్ డిగ్రీలు, మూడు సైన్స్ డిగ్రీలతోపాటు, 8 ఎమ్‌బిఎ మాస్టర్ డిగ్రీలని పూర్తి చేసాడు పార్థివన్. ఉద్యోగరీత్యా ఎక్కువ సమయం బోధన సెమినార్లకి కేటాయించాల్సి రావడంతో ఒక్కోసారి పరాజయాలనీ చవిచూడాల్సి వచ్చింది. సాధనకి సమయం కేటాయించలేకపోవడంతో యాక్చూరియల్ సైన్స్, సిఎ ఫైనల్ కోర్సుల్ని పూర్తిచేయలేకపోయానంటారు పార్థివన్. సాధారణంగా మన సమాజంలో ఎక్కువ డిగ్రీలు చేసిన వారిని చూడగానే ప్రతిభావంతులంటూ పొగిడేస్తుంటారు చాలామంది. అది ఎంత మాత్రం నిజం కాదంటారు. విద్యావంతులకి కూడా మతిమరపు ఉంటుంది. ఒక్కోసారి తను కూడా ప్రయాణించిన దారుల్ని మరిచిపోతుండేవారట. అడిగిన వ్యక్తినే పదే పదే అడ్రస్ అడిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. పని వత్తిని తగ్గించుకుంటూ చేసే పనిని ఇష్టపడడం ద్వారా ఇలాంటి లక్షణాల్ని దూరం చేసుకోగలుగుతామంటారు పార్థివన్. తన భార్య బ్యాంక్ ఉద్యోగిని. ఆమె సహకారంతో మరింత ముందడుగేయగలిగారు పార్థివన్. వీరి పిల్లలిద్దరూ ఇంజనీరింగ్, ఎమ్‌బిఎ పూర్తి చేశారు. కానీ తండ్రితో మాత్రం చదువులో పోటీపడలేరని నవ్వేస్తారు తెలిసినవారు. నిత్యవిద్యార్థిలా కొనసాగుతూ భవిష్యత్తులో మరిన్ని కోర్సుల్ని పూర్తిచేయాలనుకుంటున్నారు పార్థివన్. అంటే డబుల్ సెంచరీ దాటేయాలని. ఆల్ ద బెస్ట్.

– శర్వాణి





ఇండెక్స్

వినూత్నం........3
రైతమ్మల గెలుపు కథలు
స్టార్........4
రాగ ఎవరాఫ్టర్
నవ్వుల్ పువ్వుల్......... 5
వింత లోకం...........10
సూటు బూటు రైతు
కవిత్వమ్..................14
మనిషిది ప్రకృతిది
ఓ ఆత్మీయ బంధం
విజేత.............. 15
పవర్ బిల్డర్

బా...బా బ్లాక్ మనీ

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12
శాంతినికేతన్‌లో
ఒక రోజు

తెలుసా....................15
కదిలే బొమ్మల కథ
కథ 16
చీకటిలో చిరుదీపం
రుచి....................21
మేతి పన్నీర్ రైస్
బాల నేస్తాలు............23
13ఏళ్లకు... 200 ప్రదర్శనలు...
పద వికాసం.....
....24

ఆకట్టుకున్న రథయాత్ర

నాటి సమాజాల్లో మాతృస్వామిక వ్యవస్థలుండేవి. అందుకే ఆ సమాజంలో దేవుళ్ల, దేవతలు అందరూ స్త్రీలే. దక్షిణాదిలో ఊరికొక అమ్మవారిని కొలుస్తారు. దుర్గా మాత కూడా ఆ విధంగా వచ్చిన దేవతే. పండుగను మూఢాచారంగా చేయకుండా దానికి సంబంధించిన శాస్త్రీయతను తెలుసుకోవాలి. 'అమ్ములుగన్న దసరా' మాకు చాలా విషయాలని తెలియ చేసింది. ఎంబిఎను విడిచి పెట్టి సృజనాత్మకతకు పదును పెట్టిన రాహుల్ 'సృజన యాత్ర' కొందరిని అయినా సృజనాత్మకత వైపు నడిపిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. పాతకథ 'చాసో' గారి రథయాత్ర ప్రచురించారు. ఆనాటి కథలు చదివే అవకాశం లేనివారికి ఈ విధంగా మీరు అవకాశం కల్పిస్తున్నందుకు సంతోషం. ఇలాగే ప్రతి వారం మాలాంటి వారి కోసం ఒక పాత కథను, ఆ కథ రచనా కాలాన్ని ప్రచురిస్తారని ఆశిస్తున్నాను. చరిత్ర వేటగాడు ఆదిత్య విజ్ గారికి ధన్యవాదాలు.

-మర్రి సూర్యనారాయణ, విశాఖపట్నం

అమ్ములుగన్న దసరా

'అమ్ములుగన్న దసరా' ....విశ్లేషణాత్మకంగా సందర్భానుగుణంగా



ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణకై సృజనయాత్ర చేస్తున్న యువ హీరోలకు హేట్సాఫ్. పలురకాలైన రెస్టారెంట్ల విశేషాలు 'విందులు...వింతలు' మా ముందు కనిపింపజేసారు. 'డెడ్‌లైన్' 'కలను ఉరితీశారెవరో' కవితలు భావగర్భితంగా రూపుదిద్దుకున్నాయి. 'రథయాత్ర' కథాకర్త చాగంటిసోమయాజులు గారికి అభినందనలు. చరిత్ర వేటగాడు 'ఆదిత్యవిజ్' ను అభినందించి తీరాల్సిందే. 'గాజులోకం' దృశ్యపరికరాలు కనువిందు చేసాయి. ఐయుఎన్‌సిఐ హెరిటేజ్ హీరోస్ అవార్డ్‌కి సంపూర్ణ అర్హత గలవాడు బిభూతిలహకర్. రియల్ లైఫ్ బాక్సర్, రీల్ లైఫ్‌కి మా బెస్టాఫ్ లక్.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

వారెవ్వా గాజు లోకం

దసరా సందర్భంగా అందించిన అమ్ముల గన్న దసరా కవర్‌స్టోరీ బాగుంది. గాజులోకం వారెవ్వా అనిపించింది. విందులు వింతలూ సూపర్బ్. 'స్టాంపులపై తారలు' ఆసక్తి దాయకంగా ఉంది.

- నీలిమ సుబ్బిసెట్టి, రాజానగరం

ఓ సృజన యాత్ర

నేడు యువత చదువు, కెరీర్ కోసం పరుగుపెడుతుంటే పర్యావరణ పరిరక్షణ కోసం రాహుల్ చేస్తున్న సృజన యాత్ర యువతకి మార్గదర్శకంగా ఉంది. అట్టమీది కథలో అమ్ములుగన్న దసరా ఆకట్టుకుంది. వివిధ రకాల రెస్టారెంట్లు వాటి విందూ వినోదాలు అలరించాయి. చాసో రచించిన రథయాత్ర పాత కథే అయినా అందించినందుకు ధన్యవాదాలు. ప్రకృతికోసం పనిచేస్తున్న బిభూతి లహకర్ నిజంగా హెరిటేజ్ హీరో. చిన్న పిల్లలు కథలకి దూరమవకుండా కృషిచేస్తున్న ప్రథమ్ బుక్ హౌస్ కృషికి హ్యాస్ ఆఫ్. స్టాంప్‌లపై తారలు, పనిమనసు, చిట్టితల్లినవ్వాలి, మృతుల పట్టణం, వెలనిన్ దేవత, రీల్‌లో రియల్ లైఫ్ బాక్సర్, నవ్వుల్ పువ్వుల్ బాగున్నాయి.

- టి.పావని, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

రైతమ్మల గెలుపు కథలు

వినూత్నం

డాక్యుమెంటరీలు, కమ్యూనిటీ రేడియోలు, తక్కువ అద్దెకు వ్యవసాయ పనిముట్లు... ఇలా వ్యవసాయ రంగంలో మార్పుకు నాట్లు వేస్తున్నారు కొందరు మహిళా రైతులు. వాతావరణ మార్పులకు, పర్యావరణ పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవసాయాన్ని మలచడంలో సేంద్రీయ విధానాల్ని, సాంకేతికతను మారుమూల గ్రామాలకు పరిచయం చేస్తూ ఓ పెద్ద మార్పుకు ఎరువులు చల్లుతున్నారు. ఈ పాటికే వీరి పంట దిగుబడి పెద్ద లాభమే చేసింది.. మహిళా సాధికారతకు, రైతన్న సంక్షేమానికి, పర్యావరణ పరిరక్షణకి కూడా. చిన్నగా మొదలైన ఈ మార్పు అంతటా విస్తరిస్తే..?



'సంగమ్' బృందం

వాతావరణ మార్పులతో కుదేలవుతోన్న వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటపడేయాలంటే కాలానికి తగ్గ మార్పులు సేద్య విధానాల్లోను జరగాలని ఐరాస చెబుతోంది. వ్యవసాయ రంగంలో మహిళలకు పురుషులతో సమానంగా వనరులు అందించినట్లైతే వారు పురుషుల కంటే 4 శాతం ఎక్కువ వృద్ధిని సాధించగలరని, దీని ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 10 కోట్ల మంది చిన్నారులకు సమతులాహారం అందించగలరనేది ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) నివేదికలో వెల్లడయ్యింది. వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర చాలా బలీయమైందని తేల్చింది. తమ స్వయంకృషి ద్వారా వీటిని రుజువు చేస్తున్నారు భారత్‌కి చెందిన మహిళా రైతులు.

సుందర వనాల్లో ప్రకృతి సేద్యం..

ఉత్తర బెంగాల్ ప్రాంతంలోని సుందర్‌బన్ అడవులు త్వరిత గతిన వాతావారణ మార్పులకి హాట్‌స్పాట్స్‌గా ఉంటాయి. ఈ ప్రాంతంతో వ్యవసాయం, పశుపోషణని సమర్థవంతంగా నిర్వహించి గ్రామంలో ఆదర్శ రైతుగా పేరు తెచ్చుకున్నారు రీతా కమిలి. కొన్నేళ్లుగా సేంద్రీయ వ్యవసాయంతో పాటు ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ పద్ధతుల ద్వారా పశుపోషణ, చేపల చెరువుల నిర్వహణని తన పొలంలో విజయవంతంగా కొనసాగిస్తున్నారు. పశువుల పేడ, చేపల విసర్జకాలు, వ్యవసాయ వ్యర్థాల నుంచి బయోగ్యాస్‌ని ఉత్పత్తి చేసి దాన్ని వంటకు ఉపయోగించేవారు. మిగిలిన వ్యర్థాలను ఎరువుగా మార్చే సేంద్రీయ వ్యవవసాయ పద్ధతుల ద్వారా తన కుటుంబానికి ఏడాదికి సరిపడా ఆహార పదార్థాలని సమకూర్చుకోవడంతోపాటు ఆరోగ్యమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ మహిళా రైతు సుందర్‌బన్‌లోని ఇతర రైతులకి మార్గదర్శిగా నిలిచారు.

గిరిజనంలోకి...

ఆత్రం పద్మాబాయ్ హైదరాబాద్ దగ్గరలోని పటేల్‌గూడకు చెందిన ఫెయిర్ ట్రేడ్ రైతు. తన మూడెకరాల పొలంలో పత్తి, కందులు, మినుములు, సోయా లాంటి పంటల్ని పండిస్తూ ఫెయిర్ ట్రేడ్ ఇండియాకి వ్యవసాయ ఉత్పత్తులని అందించే సర్టిఫైడ్ రైతుగా గుర్తింపు పొందారు. ఎనిమిది గ్రామాలకు సర్పంచ్‌గా ఎన్నుకోబడిన ఈ ఆదివాసీ మహిళా రైతు తన సొంత పొలాన్ని సాగు చేసుకోవడంతో పాటు దాదాపు 2000 మంది ఫెయిర్ ట్రేడ్ రైతులందరికి ఆసరాగా నిలిచారు. శ్రమని తగ్గించే కొడవళ్లు, పార,

రీతా కమిలి

కలుపుతీసే పరికరాలు సొంతగా కొనుగోలు చేసే శక్తి లేని రైతులు వడ్డీ వ్యాపారులని ఆశ్రయించి మోసపోతుండేవారు. 2013లో ఫెయిర్ ట్రేడ్ కమిటీ నుండి 30 వేల రూపాయల రుణంతో వ్యవసాయ పరికరాల్ని కొని వాటిని రైతులకి అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు పద్మ. రోజుకు రెండు నుంచి 5 రూపాయల అద్దెతో వ్యవసాయ పరికరాలు లభించడంతో రైతులకు రుణ భారం తప్పింది. వ్యవసాయ అభివృద్ధితో పాటు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, వర్షపునీటి పరిరక్షణ, గ్రామంలోని పాఠశాలలో శుభ్రమైన మంచి నీరు అందించే పనుల కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యేలా చేశారు. సర్పంచ్‌గా గ్రామీణ అభివృద్ధికి కృషిచేశారు పద్మా భాయ్.

కాలానికి తగ్గ మార్పులు

కొన్ని ప్రాంతాల్లో అక్కడ నేల, వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ పంటల్ని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలపై అవగాహన లేని చాలామంది రైతులు వాతావరణంలో చోటుచేసుకునే అకాల మార్పుల కారణంగా నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. అలాంటి పరిస్థితుల నుండి మహారాష్ట్ర విదర్భ ప్రాంతపు రైతులని చైతన్య పరిచేందుకు కృషిచేస్తోంది చంద్రమ్మ అనే మహిళా రైతు. ఆమెకు తోడు మెదక్ జిల్లా, జహీరాబాద్ పాస్తాపూర్ గ్రామానికి చెందిన మహిళా రైతులు చేతులు కలిపారు. ఒకప్పుడు వీరందరూ మహిళా కూలీలుగా కటిక పేదరికాన్ని చవిచూసిన వారే. వారు ఒక సంఘంగా ఏర్పడి మహిళలందరూ సొంత గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధితో పాటు ప్రస్తుతం పొరుగు రాష్ట్రాల్లోని రైతుల వికాసానికి కృషిచేస్తున్నారు. సేంద్రీయ పద్ధతుల్లో విత్తనాలను తయారుచేసే ప్రక్రియ ద్వారా ఒక విత్తన బ్యాంకుని స్థాపించారు చంద్రమ్మ. దాదాపు 30 గ్రామాల నుంచి సేంద్రీయ విత్తనాలను సేకరించి వస్తుమార్పిడి విధానం ద్వారా ఈ విత్తనాలని ఇతర రైతులకి అందిస్తారు. చంద్రమ్మతో పాటు మిగిలిన జట్టు సభ్యులందరూ సేంద్రీయ వ్యవసాయం, వాతావరణ అనుకూల పంటల సాగు, సేంద్రీయ విత్తనాలు, ఎరువుల తయారీ విధానాలను వివిధ గ్రామాల్లో రైతులకి బోధించడంతో పాటు, డాక్యుమెంటరీల రూపంలో వీటిని ప్రదర్శిస్తున్నారు. బడి చదువు కూడా లేని స్త్రీలందరూ తోటి రైతుల చైతన్యం కోసం కెమేరాలు చేతపట్టడం గొప్ప మార్పుకి దారితీస్తోంది. భారతదేశంలో తొలి రైతుల కమ్యూనిటీ రేడియో 'సంగమ్'ను రూపుదిద్దింది కూడా ఈ మహిళలే. ఇది 200 గ్రామాల రైతులకు ఉపయోగపడుతోంది.

రాగ ఎవరాఫ్టర్...

స్టార్

సినిమాకు పరిచయమైన ఏడాదికే దక్షిణాది రాష్ట్రాలను దాటేసి క్రేజ్ దక్కించుకున్న మలయ తార మడోన్నా సెబాస్టియన్. పాటలంటే ప్రాణమనే మడోన్నా సంగీత రంగంలోనే స్థిరపడాలనుకుంది. కానీ అనుకోకుండా 'ప్రేమమ్' చిత్రంలో పాత్రకు ఎంపికైంది. అనుకున్న పాత్ర కన్నా మరో పాత్రకు సరిగ్గా నప్పుతుందని దానికి మార్చారు. అది ఆమె కెరీర్‌ను మార్చేసింది. సంగీతం, నటన రెండింటా ఆదరిస్తూ అభిమానులు 'ప్రేమమ్'ను చాటుతున్నారు.



- ఎర్నాకులంలో పుట్టిన మడోన్నా కొలన్‌చెర్రిలో స్థిరపడింది. ఒమన్‌లోని సలాలాహ్ ఇండియన్ స్కూల్‌లో బడి పాఠాలు చదివి బెంగళూరు క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేసింది.
- చిన్నప్పటి నుంచే సంగీతం మీద విపరీతమైన ఇష్టం. కర్నాటక, పాశ్చాత్య సంగీత శైలుల్లో శిక్షణ తీసుకుంది.
- కాలేజీ రోజుల్లోనే 'రాగ' అనే మ్యూజిక్ బ్యాండ్‌ను నడిపింది.
- మ్యూజిక్ మోజో టీవీ షో ద్వారా మడోన్నా పాపులర్ అయ్యింది.
- దీపక్ దేవ్, గోపి సుందర్ వంటి సంగీత దర్శకుల గీతాలకు గొంతుకనిచ్చింది.
- 'యూ టూ బ్రూటస్' చిత్ర టైటిల్ సాంగ్ 'రావుకాలిల్' అద్భుతంగా పాడటంతో ఆ చిత్రానికి సంగీతాన్నిచ్చిన రోబీ అబ్రహామ్ మడోన్నాతో కలసి 'ఎవరాఫ్టర్' అనే మ్యూజిక్ బ్యాండ్‌ను ఏర్పాటు చేశాడు.
- ఇద్దరూ కలసి 'వెరుతే' అనే మ్యూజిక్ వీడియోను ఈ ఏడాది ఆరంభంలో విడుదల చేశారు.
- హిట్ 96.7 దుబాయ్ రేడియో స్టేషన్‌కు జింగిల్స్ పాడింది మడోన్నా.
- మలయాళీ 'ప్రేమమ్' చిత్ర దర్శకుడు ఆల్ఫోన్సె పుతారెన్ ఆమె షోను వీక్షించాక ఫోన్ చేసి ఆడిషన్స్ రావాల్సిందిగా కోరాడు.
- నటనపై అంత ఆసక్తి లేని మడోన్నా ఆడిషన్స్‌లో నెగ్గుకు రావడం విశేషం. అలా 'ప్రేమమ్'లోని 'మేరీ' పాత్రకు ఎంపికైంది. కానీ ఆమె హావభావాలు 'సెలీన్' పాత్రకు బాగుంటాయని అదే ఫైనల్ చేశారు.
- తమిళ్‌లో 'కథలుమ్ కథందు పోగుమ్'లో నటించింది. కొరియా చిత్రం 'మై డియర్ డెస్పరాడో'కు రీమేక్‌గా వచ్చిన ఆ చిత్రం పెద్ద హిట్‌గా నిలిచి మడోన్నాకు క్రేజ్‌ను తెచ్చింది.
- తర్వాత ఆమె నటించిన మలయాళీ చిత్రం 'కింగ్ లయర్' కూడా విజయాన్ని సాధించి ఆమెకు పేరు తెచ్చింది.
- మలయాళీ చిత్రం ద్వారానే తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మడోన్నా తెలుగు 'ప్రేమమ్'లోను అదే పాత్రలో మరింత ఆకట్టుకుంది.
- నటనలో మంచి మార్కులు పడటంతో ఆంగ్ల చిత్రం 'హ్యూమన్స్ ఆఫ్ సమ్‌వన్'లోను అవకాశం వచ్చింది.
- ప్రస్తుతం 'కవన్' తమిళ చిత్రంలో నటిస్తోంది మడోన్నా. ఓ వైపు నటన, మరో వైపు సంగీతం రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ కెరీర్‌ను మలచుకుంటోంది.
- ఒకేసారి ఎక్కువ సినిమాలు చేసేయడం కాకుండా ఒక్కో చిత్రంపై దృష్టి పెట్టి మంచి పాత్రలు చేయాలని నిర్ణయించుకుంది.
- దర్శకుడు, స్క్రిప్ట్ చూసే సినిమాని ఓకే చేస్తుందట. మంచి చిత్రంలో అవకాశం వస్తే పాత్ర విషయంలో కాస్త తగ్గినా పర్లేదని అంటోంది.
- కళ్లతో నవ్వుతూ.. కళ్లతో మాట్లాడుతూ తనకంటూ ఓ ప్రత్యేక నటనా శైలితో గుర్తింపు పొందింది.
- నటనలో ఎంత మార్కులు పడినా తనకు రెండింటిలో ఏదిష్టమంటే సంగీతమే ప్రాణమంటోంది.
- ఫేమ్‌ను అస్సలు ఇష్టపడని మడోన్నా.. దానికి కారణం కూడా ఉందని ఓ సందర్భంలో చెప్పింది. పబ్లిక్‌లో తనను ప్రత్యేకంగా చూడటం అస్సలు ఇష్టముండదట. ఓసారి ఓ చిన్న పిల్లాడిని దగ్గరకు తీసుకోబోతే నేను మీ ముఖాన్ని తాకొచ్చా అని భయంగా అడిగాడట. అప్పటి నుంచి స్టార్‌డమ్ బాధలెలా ఉంటాయో అర్థమైందట.
- ఆన్ స్క్రీన్ రొమాన్స్ తనకు నప్పదని కనీసం ఎదుటి వ్యక్తిని హత్తుకుని నటించలేనంటూ ముందే చెబుతుందట. అలాంటి పాత్రల్ని తాను చేయలేదట.

– జెస్

నవ్వుల్ - పువ్వుల్

దొందూ దొందే

రోగి: డాక్టర్ గారూ ఈ మధ్య నాకు సరిగా వినపడటం లేదు నా చెవులు కాస్త పరీక్షించండి.

డాక్టర్: సరే ఈ మందులు వాడండి గాయం మానిపోతుంది.



ఎనౌన్సర్

రామయ్య: అదేంటండీ బస్టాండులో ఎనౌన్సరు 'మరో గంటలో బస్సు 50 కి.మి వేగంతో దూసుకు రావచ్చు' అని చెబుతోంది?

చంద్రం: ఆవిడ గతంలో వాతావరణ శాఖలో పనిచేసుంటారు.

సౌకర్యం

డాక్టర్: పదో నెంబరు గదిలో పేషెంట్‌ని డిశ్చార్జ్ చేశాం కదా ఇంకా వెళ్లినట్టులేరు.

నర్స్: ఆమె వెళ్లనంటోంది డాక్టర్

డాక్టర్: ఏ ఎందుకని?

నర్స్: వాళ్లింట్లో టీవి పాడైపోయి సీరియళ్లు చూడడం కష్టంగా ఉందట. ఇక్కడైతే టీవి ఉందని......

అలవాటులో పొరపాటు

సీత: అదేమిటి మీ ఆయన పావు గంటకోసారి నీ నెత్తిన నీళ్లు జల్లుతున్నారు?

రాధ: ఆయనది పూల వ్యాపారం కదా వొదినా అలవాటులో చేసేస్తున్నారు.

హస్తవాసి

భర్త: నేను తెచ్చిన మందు తిని ఎన్ని ఎలుకలు చచ్చాయో చూడు...!

భార్య: ఆ మందు ఇంకా పెట్టలేదే...! అవి నేను చేసిన స్వీట్ తిన్నాయి.

నాలుగు రాళ్లు

శ్రీను: మీ ఇంటి వెనకాల అన్ని రాళ్లున్నాయేంటి రా....

వెంగళప్ప: వీలైనప్పుడల్లా నాలుగు రాళ్లు వెనకెయ్యమని మా నాన్న చెబుతుండే వాడులే..

మౌనంగా

భార్య: మన పెళ్లై అయిదేళ్లయింది. ఈ మ్యారేజ్ డేని ఎలా సెలెబ్రేట్ చేసుకుందాం డియర్!

భర్త: ఏ ముంది....లేచి నిలబడి అయిదు నిమిషాల పాటు మౌనం పాటిద్దాం..!

ఫ్రీ...

శ్రీను: మీ హోటల్లో టీ తాగుతుంటే ఈగ వచ్చింది.

మేనేజర్: భలే వారే! మీరు దానికి బిల్లేమీ కట్టనవసరం లేదు.

తెలిసింది

అప్పారావు: నా భార్య గురించి గొప్పగా చెప్పకూడదు కానీ తను తను ఏ పనినైనా ఒక రోజు ముందే చేసేస్తుంది.

సుబ్బారావు: ఆ విషయం ఇందాకే తెలిసింది.

అప్పారావు: ఎలా

సుబ్బారావు: ఆవిడ వడ్డించిన కూర తిని...



క్వాలిఫికేషన్

పుల్లారావ్: మా స్వీట్ షాప్‌లో పనిచేయడానికి నీకున్న అర్హత ఏమిటి?

సుబ్బయ్యా: నాకు షుగర్ ఉంది సార్!



బా...బా బ్లాక్ మనీ

భారతదేశంలో నల్లధనం (బ్లాక్‌మని) శరవేగంగా పెరుగుతున్నది. దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన తర్వాత ఈ వేగం మరింత పెరిగింది. కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ, లేదా బిజెపి నాయకత్వంలోని యన్‌డిఎలలో ఏ ప్రభుత్వం పాలిస్తున్నా నల్లధనాన్ని వెలికి తీస్తామని పాలకులు కబుర్లు చెప్పటం మినహా కార్యాచరణ శూన్యంగా ఉన్నది. నల్లధనం పరిమాణం చూస్తే ఎవరికైనా కళ్ళు తిరగవలసిందే! ఈ బ్లాక్ మనీపై వివరిస్తుంది ఈ అట్టమీది కథ.

- ఎ. కోటిరెడ్డి
94900 98626

డబ్బుకు నలుపు తెలుపు అంటూ ఏమీ ఉండదు. సంపాదించుకున్న ఆదాయంపై చట్టప్రకారం పన్ను చెల్లిస్తే అది తెల్ల డబ్బు. పన్నులు చెల్లించకుండా అక్రమంగా దాచుకుంటే అది నల్ల డబ్బుగా మారుతుంది. దేశంలో ఉన్న పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, వృత్తులు, వ్యాపారాల ద్వారా సంపాదించుకొంటున్న వారు ఎక్కువ మంది తమ వాస్తవ ఆదాయాన్ని కప్పిపెట్టి పన్నుల నుండి తప్పించుకోవటానికి చేసే ప్రయత్నాలు నల్ల ధనం పోగుపడటానికి కారణమౌతున్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన వారిలో పలు దేశాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలలో ప్రధాన బాధ్యతలలో ఉన్న ప్రధాని స్థాయి నుండి ముఖ్యమంత్రులు, మంత్రులు, యంపిలు, యంయల్‌ఎలు, బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు తదితరుల పేర్లు వింటూనే ఉన్నాం. వీరంతా ఓ వ్యవస్థలా మారి తమ అక్రమ సంపాదనను రహస్యంగా దాచుకొని సమాంతర ఆర్థిక వ్యవస్థల్ని నడిపిస్తున్నారు. వీటి స్థాయి, పరిమాణం ఊహకు అందదు. విదేశాల్లోని ట్యాక్స్ హ్యావెన్లలో, వివరాల గుట్టు విప్పని బ్యాంకుల్లోకి తరలిస్తున్నారు. వీటిని వెనక్కు రప్పించడం, దేశంలో సర్క్యులేట్ అవుతున్న బ్లాక్ మనీని నిరోధించడమనేది కలగా మారిపోయింది.

తెలుగు రాష్ట్రాల్లో కూడా పెద్ద మొత్తంలో నల్లధనం ఉత్పత్తి అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అందుకు కారణమౌతోంది. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నల్ల ధనం వెల్లడి పథకం సందర్భంగా రాష్ట్రం నుండి ఒక్కరే పది వేల కోట్ల రూపాయల నల్లధనాన్ని వెల్లడించారని, అది 'నువ్వంటే నువ్వు' అని జగన్, చంద్రబాబు నాయుడు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఆ పది వేల కోట్ల రూపాయలు ఎవరు వెల్లడించారో మనం చెప్పలేం.

'స్విస్'లో సర్దేసి

2008లో స్విట్జర్లాండ్ బ్యాంకర్స్ అసోసియేషన్ వెల్లడించిన సమాచారం ప్రకారం ఆ సంవత్సరంలో స్విస్ బ్యాంకుల్లో మన దేశస్తులు దాచుకున్న డబ్బు 1,45,600 కోట్ల డాలర్లు. మన రూపాయల్లో సుమారు కోటి కోట్ల రూపాయలు. ఆ సంవత్సరం మన దేశ జిడిపి 1,22,400 కోట్ల డాలర్లు. సుమారు 80 లక్షల కోట్ల రూపాయలు..అంటే దేశం నుండి ఎంత భారీ పరిమాణంలో నల్లధనం తరలిపోతున్నదో ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి.

అరశాతమే వెనక్కా..!

కేంద్ర ప్రభుత్వం ఆదాయ వెల్లడి పథకం 2016ను జూన్ 1వ తేదీ నుండి నాలుగు మాసాల పాటు అమలులో ఉండే విధంగా ప్రకటించింది. ఈ పథకాన్ని అనుసరించి నల్లధనం వివరాలు తెలియజేసిన వారు 30 శాతం పన్నులు, వడ్డీ, పెనాల్టీ 7.5 శాతం చొప్పున మొత్తం 45 శాతం చెల్లించాలి. ఆదాయాన్ని వెల్లడించే వారికి ప్రోత్సాహకంగా ఉండటానికనే పేరుతో చెల్లించాల్సిన మొత్తాన్ని 31 శాతానికి తగ్గించారు. చెల్లించే మొత్తం ఒక్కసారిగా కాకుండా వచ్చే సంవత్సరం సెప్టెంబరు 30 వరకు మూడు వాయిదాలలో చెల్లించటానికి అవకాశం

కల్పించారు. దొంగలకు వరుస రాయితీలు! అయినా వెల్లడైన మొత్తం 65,250 కోట్ల రూపాయలు మాత్రమే. మొత్తం నల్లధనంలో ఈ మొత్తం ఒక్క శాతంలో సగం కూడా ఉండదు. ఈ మాత్రానికే ఏదో సాధించినట్లు ప్రభుత్వం జబ్బలు చరుచుకొని గొప్పలు చెప్పుకుంటోంది.

లెక్కకు అందకుండా..

. పారిశ్రామికవేత్తలు, వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసేవారు పన్నులను తప్పించుకోవటం కోసం తమ టర్నోవర్‌ను తగ్గించి చూపుతున్నారు. ఉదాహరణకు ఒక పారిశ్రామికవేత్త సంవత్సరం టర్నోవర్ ఐదుకోట్ల రూపాయలైతే దానిని తగ్గించి రెండుకోట్ల రూపాయల టర్నోవర్ మాత్రమే జరిగినట్లు లెక్కలు చూయిస్తాడు. ఆ మొత్తానికి మాత్రమే పన్ను చెల్లిస్తాడు. మిగిలిన మూడు కోట్ల రూపాయలపై పన్ను చెల్లించడు. రెండు కోట్ల రూపాయల టర్నోవర్‌పై వచ్చిన లాభాలను మాత్రమే చూయించి, ఆ మొత్తంపై వచ్చిన లాభానికి మాత్రమే ఆదాయపు పన్ను చెల్లిస్తాడు. మిగతా మూడుకోట్ల రూపాయలపై వచ్చిన ఆదాయం నల్లధనం (పన్ను చెల్లించని ఆదాయం)గా మారుతుంది.

పన్నుల స్వర్గాలు (ట్యాక్స్ హ్యావెన్స్)

దేశంలో పోగుపడుతున్న నల్లధనంలో కొంతభాగం దేశంలోనే ఉంటున్నా ఎక్కువ భాగం విదేశాలకు తరలిపోతున్నది. వ్యక్తులు, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు ఇతరత్రా సంపాదించిన ఆదాయంపై పన్నులు వసూలు చేయని దేశాలు కొన్ని ఉన్నాయి. అటువంటి దేశాలకు నల్లధనం ప్రయాణం చేస్తుంది. మనదేశం మారిషస్‌తో చేసుకున్న రెండు దేశాలలో పన్నులు చెల్లించడాన్ని నివారించే (డబుల్ టాక్స్ ఎవాయిడెన్స్ అగ్రిమెంట్) ఒప్పందం ప్రకారం వ్యక్తి నివసిస్తున్న దేశంలో పన్ను చెల్లిస్తాడు. కంపెనీ ఉన్న దేశంలో చెల్లించాల్సిన అవసరం లేదు. మారిషస్‌లో నివాసం పేరుతో కంపెనీని ఏర్పాటు చేసుకుని, ఆ కంపెనీ ద్వారా మనదేశంలోని స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి లాభాలు సంపాదిస్తే ఆ లాభాలపై మనదేశంలో పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. మారిషస్‌లో చెల్లించాలి. మారిషస్‌లో క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ లేదు. కాబట్టి అక్కడ చెల్లించాల్సిన అవసరం లేదు. రెండు దేశాలలో పన్నులు చెల్లించటాన్ని నివారించే ఒప్పందం అసలేమీ పన్ను చెల్లించకుండా తప్పించుకునే అవకాశం కల్పిస్తున్నది. అది నల్లధనం పోగుపడటానికి కారణమౌతోంది. ఆ దేశాలకు చేరిన తర్వాత 'నల్ల ధనం' 'తెల్ల ధనం' గా మారి విదేశీ పెట్టుబడుల రూపంలో తిరిగి దేశంలోకి అడుగుపెడుతుంది. ప్రపంచంలో ఇటువంటి 'పన్నుల స్వర్గాలు' 88 ఉన్నాయి. ఈ దేశాలతో మనదేశానికి రెండు చోట్లా పన్నులు చెల్లించటాన్ని నివారించే ఒప్పందాలు ఉన్నాయి. మారిషస్, మలేషియా, సింగపూర్, పనామా, బెలిజ్, బెర్ముడా, సెయింట్ కిట్స్, బహమాస్, కుక్ ఐలాండ్స్, కేమెన్ ఐలాండ్స్ తదితర దేశాలు పన్ను స్వర్గాల జాబితాలో ఉన్నాయి. 'పన్నుల స్వర్గాలు' గా ఉన్న ఈ దేశాలకు మనదేశంలో తయారైన 'నల్లధనం' చేరుతుంది. ఒకదేశానికి చేరిన నల్లధనం ఆ దేశంలో ఒక కంపెనీని (పేరుకు మాత్రమే) ఏర్పాటు చేస్తుంది. ఆ కంపెనీ పేరుతో దేశం నుండి తరలించిన 'నల్లధనాన్ని' విదేశీ పెట్టుబడుల (యఫ్‌డిఐ, యఫ్ఐఐ) రూపంలో తిరిగి దేశంలోకి తరలిస్తారు. ఆ విధంగా తరలి వచ్చిన 'నల్లధనం' ఇక్కడ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకు ప్రకటించిన రాయితీలన్నింటినీ స్వంతం చేసుకుంటుంది.



'పనామా'లో కొట్టుకెళ్లి..

ఈ సంవత్సరం మే నెలలో ఇంటర్నేషనల్ కన్సార్టియం ఫర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్స్ (ఐసిఐజె) వెల్లడించిన పనామా పేపర్లలో ఉన్న ప్రభుత్వాధినేతలు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక, వాణిజ్య, వివిధ రంగాల ప్రముఖులతో కూడిన లిస్టు ప్రపంచవ్యాపితంగా సంచలనం సృష్టించింది. ఈ లిస్టులో మనదేశానికి చెందిన రాజకీయ నాయకులు, పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు అనేక మంది పేర్లు ఉన్నాయి. మొత్తం రెండు లక్షల విదేశీ సంస్థల పేర్లను పనామా పేపర్లు వెల్లడి చేశాయి. పనామా పేపర్లు వెల్లడైన ఐదు మాసాల తర్వాత 'బహమాస్'లో నమోదైన 1,75,000 కంపెనీల వివరాలు వెల్లడైనాయి. ఈ లిస్టులో మనదేశానికి చెందిన గనులు, ఖనిజాలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్, మీడియా తదితర రంగాలకు చెందిన 475 మంది పేర్లున్నాయి. కార్పొరేట్ మధ్యవర్తులు, బహమాస్ ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు మధ్యవర్తులుగా వ్యవహరించిన 539 మంది పేర్లు కూడా బహమాస్ పేపర్లు వెల్లడించాయి.



నలుపు-తెలుపులు

పరిశ్రమలు, వ్యాపారాలలో తాము సంపాదించిన మొత్తంపై నిజాయితీగా పన్నులు చెల్లించేవారు తక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రభుత్వం నుండి వారికేమీ ప్రోత్సాహకాలుండవు. తమ సంపాదనపై సక్రమంగా పన్నులు చెల్లించకుండా, పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన సంపదను అక్రమంగా విదేశాలకు తరలించినవారు అధిక ఆదాయం పొందుతున్నారు. పన్ను చెల్లింపులో ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు వారెటువంటి శిక్షకు గురికావటం లేదు. అక్రమ ఆదాయాలను బయట పెట్టమని ప్రభుత్వం రకరకాల రాయితీలను

ప్రకటిస్తున్నది. ఆ విధంగానూ వారు లాభాలను పొందుతున్నారు. న్యాయంగా పన్ను చెల్లించిన వారికి భారాలు. పన్నులు ఎగ్గొట్టిన వారికి లాభాలు, సత్కారాలు... ఎంత విచిత్రం!

బిజెపి ఎన్నికల వాగ్దానాలు

2014 సాధారణ ఎన్నికలకు ముందు బిజెపి నల్లధనాన్ని గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. విదేశాలలో మన దేశస్తులు దాచుకున్న 70 లక్షల కోట్ల రూపాయల నల్లధనం ఉన్నదని, తాము ఎన్నికైతే ఆ మొత్తాన్ని దేశంలోకి రప్పించి, ఒక్కొక్కరి ఎకౌంటులో 15 లక్షల రూపాయలు జమ చేస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత 2014 మే నెల 28న మోడి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాడు. అదేరోజు వెంటనే నల్లధనంపై దర్యాప్తు జరపటం కోసం సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి నాయకత్వాన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు.

వాగ్దాన భంగం

చేసిన వాగ్దానాలకు చెల్లుచీటి ఇవ్వటంలో కాషాయ నేతలకు ఎవరూ సాటిరారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ముందుకొచ్చిన కేసుల్లో అతిపెద్దది ప్రధాని అనుంగు మిత్రుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ ఆదానికి సంబంధించినది. ఆదాని 5,000 కోట్ల రూపాయలకు పన్నులు చెల్లించకుండా తప్పించుకుని, ఆ మొత్తాన్ని 'పన్నుల స్వర్గాల' కు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కాని అతనిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

'సుప్రీం'తో చెలగాటం

నల్లధనాన్ని విదేశాలలో దాచిన వారిలో 20 మంది పేర్లను వికీలీక్స్ వెల్లడించింది. ఆ లిస్టు మొత్తాన్ని బహిర్గతం చేయకుండా ప్రభుత్వం లిస్టులోని కొన్ని పేర్లను మాత్రమే వెల్లడించింది. ప్రభుత్వం వెల్లడించిన పేర్లలో డాబర్ కంపెనీ ప్రమోటర్ ప్రదీప్ బర్మన్, రాజ్‌కోట్‌లో బంగారం వ్యాపారం చేసే పంకజ్ చిమన్‌లాల్ లోధియా, గోవాలో గనుల తవ్వకం రంగంలో ఉన్న కంపెనీ అధినేత రాధా సతీష్ టింబ్లూ, ఆ కంపెనీ భాగస్వాముల్లో మరి కొందరి పేర్లను మాత్రమే ప్రభుత్వం బయటపెట్టింది. దీనిపై ఆగ్రహం చెందిన సుప్రీంకోర్టు ప్రభుత్వం వద్ద ఉన్న లిస్టు మొత్తాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందానికి, తనకు ఇవ్వాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశం తర్వాత ప్రభుత్వం తనవద్ద ఉన్న లిస్టును ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఇస్తానని, సుప్రీంకోర్టుకు ఇవ్వనని చెప్పింది. దానిపై సుప్రీంకోర్టు





ఎంచుకున్న కొందరి పేర్లను మాత్రమే బయటపెట్టే హక్కు, (కొందరిని కాపాడే హక్కు) ప్రభుత్వానికి లేదని, విదేశాలలో ఎకౌంట్లున్న వారిని రక్షించటానికి మీరెందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించింది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో నల్లధనాన్ని విదేశాలకు తరలించిన వారిపేర్లను బయటపెట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు భావించింది.

పెద్ద చేపలను ఎందుకు పట్టుకోరబ్బా

ప్రభుత్వం వెల్లడించిన పేర్లు నామమాత్రమైనవి. వందల కోట్ల రూపాయల టర్నోవరు కూడా లేని సంస్థలు లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని విదేశాలకు తరలించటం సాధ్యమయ్యేది కాదు. నల్లధనం తరలింపులో పాత్ర ఉన్నవారి వివరాలు తెలుసుకోవటం ప్రభుత్వాలకు అసాధ్యం కాదు. వారి వివరాలు తెలుసుకోవటానికి



వచ్చిన అవకాశాలను ప్రభుత్వాలు ఉపయోగించుకోలేదు. భారతీయులు స్విస్ బ్యాంకులలో దాచుకున్న డబ్బు 70 లక్షల కోట్ల రూపాయలున్నదని, భారత ప్రభుత్వం అధికారికంగా అడిగితే ఈ 70 లక్షల కోట్ల రూపాయలకు సంబంధించి వివరాలు అందజేస్తానని స్విట్జర్లాండ్ ప్రభుత్వం 2008లో ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆనాడు అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం స్విస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేదు. నల్లధనం దాచినవారి వివరాలు తెలుసుకొని, వారు దాచిన 'నల్లధనాన్ని' దేశంలోకి తీసుకురావటానికి ప్రయత్నం చేయలేదు. ఆనాడు ప్రతిపక్షంగా ఉండి, ఈనాడు అధికారంలోకి వచ్చిన బిజెపి ఆనాడు కాని, ఈనాడు కాని నల్లధనం దాచినవారి వివరాలు తెలుసుకోవటానికి ఏ మాత్రం శ్రద్ధ చూయించటం లేదు. స్విట్జర్లాండ్ ప్రభుత్వ సానుకూల వైఖరిని వినియోగించుకొని ప్రభుత్వం అధికారికంగా విజ్ఞప్తి చేసివుంటే మొత్తం నల్లధనం దాచిన వారందరి పేర్లు వెల్లడయ్యేవి. పెద్ద చేపలన్నీ బయటపడేవి. పెద్ద చేపలను బయటపెట్టటం నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేదు. నేటి బిజెపి ప్రభుత్వానికీ ఇష్టం లేదు. బిజెపి ప్రభుత్వం పేర్లు వెల్లడైన వారిని కూడా కాపాడటానికి ప్రయత్నం చేస్తున్నది. రాజకీయ రంగంలో ప్రత్యర్థులుగా వ్యవహరిస్తూ సాధారణమైన విషయాలపై రోజూ కత్తులు దూసుకొనే కాంగ్రెస్, బిజెపిలు దేశాన్ని కొల్లగొట్టి నల్లధనాన్ని దాచుకున్న అక్రమార్జనపరుల పేర్లు వెల్లడించటానికి వచ్చేసరికి వ్యవహరిస్తున్న తీరిది.

నల్లధనుల పట్ల ఇంత దయ ఎందుకో

ఎందువలన వీరుభయులూ 'నల్లధనం' దాచిన వారిపట్ల ఇంత దయతో వ్యవహరిస్తున్నారు? 'నల్లధనం' దాచుకున్న వారిలో బిజెపి, కాంగ్రెస్ నేతలు, వారి అనుయాయులుగా ఉన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉన్నతాధికారులు ఎక్కువ మంది ఉన్నారు. అవినీతికి పాల్పడటం ద్వారా సంపదను పోగు చేసుకోవటంలో బిజెపి నేతలు కాంగ్రెస్ నేతల కన్నా ఏ మాత్రమూ

వెనుకబడి లేరు. కాంగ్రెస్ నేతలు 2జి స్పెక్ట్రం, టెలికాం కుంభకోణం, గనుల కుంభకోణం తదితర కుంభకోణాలకు పాల్పడ్డారు. బిజెపి నేతలు ఆపరేషన్ దుర్యోధనలో తెహల్కా టేపుల్లో అడ్డంగా దొరికిపోయారు. బిజెపి అధ్యక్షుడు లక్షల రూపాయల లంచం తీసుకొంటూ కెమెరాలకు చిక్కాడు. ఆర్థికనేరస్తులైన లలిత్‌మోడి, విజయ్ మాల్యాలు దేశం నుండి తప్పించుకుపోవటానికి సహకరించారు. కాంగ్రెస్ హయాంలో కన్నా బిజెపి అధికారంలో ఉన్నకాలంలో ప్రైవేటీకరణను వేగిరం చేసింది. 1998 నుండి 2004 వరకు బిజెపి అధికారంలో ఉన్నపుడు ప్రైవేటీకరణకు ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలను వాస్తవ ధరల కన్నా మూడు నాలుగు రెట్లు తక్కువ ధరలకు పెట్టుబడిదారులకు కట్టబెట్టారు. ఏ ప్రయోజనాన్ని ఆశించకుండానే ప్రజల సొమ్మును పెట్టుబడిదారుల పాలు చేశారా? 2014లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ కార్యక్రమాన్ని మరింత వేగిరం చేశారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో మెజారిటి వాటాలను ప్రైవేటు వారికి కట్టబెట్టి, ప్రభుత్వ సంస్థలను పూర్తిగా ప్రైవేటు వారి ఆధీనం చేయటానికి ప్రణాళిక రూపొందించారు. ప్రజల, ప్రభుత్వ సొమ్మును ఈ విధంగా కారుచౌకగా ప్రైవేటు వారికి అప్పగించటానికి ప్రతిఫలంగా ప్రభుత్వంలో ఉన్నవారు ఎవరేమి పొందుతున్నారనేది కాలం గడిస్తేకాని వెల్లడి కాదు. ఇటువంటి కార్యకలాపాలలో చేతులు మారిన మొత్తం, చేతులు మారిన సంస్థకు పెట్టుబడిదారుడు చెల్లించిన విలువ, ఆ సంస్థ వాస్తవ విలువకు మధ్య వ్యత్యాసం నల్లధనంగా మారుతుంది. ఆ విధంగా వీరు, వీరి అనుయాయులు నల్లధనాన్ని పోగుచేసుకుంటున్నారు. అందువలన తమను తాము రక్షించుకుంటూ తమ అనుయాయులను కూడా రక్షిస్తుంటారు. కాబట్టే నల్లధనం పట్ల వీరి వైఖరిలో ఏ మాత్రం వ్యత్యాసం లేదు. ఎంత కలిసికట్టుగా దేశ సంపదను దోపిడీ చేస్తున్నారు! దోపిడీదారులకు రక్షణ కల్పిస్తున్నారు! దేశాన్ని మోసం చేస్తున్న దొంగలను కాపాడటంలో ఉభయుల మధ్య ఎంతటి ఏకీభావం!

ఒక్క శాతం మాత్రమే..!

2015-16లో కోటి ముప్పై లక్షల మంది అంటే దేశ ప్రజలలో ఒక్క శాతం మాత్రమే ఆదాయ పన్ను చెల్లించారు. పన్ను చెల్లించినవారిలో ఎక్కువ మంది ఉద్యోగస్తులే ఉన్నారు. ఉద్యోగుల ఆదాయం దాయటానికి వీలుండదు. కాబట్టి వారు తప్పనిసరిగా పన్ను చెల్లిస్తున్నారు. మిగతావారు వారి ఆదాయాన్ని దాచిపెట్టి అతి తక్కువ మొత్తానికి మాత్రమే ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. దేశంలో ఏడు శాతానికి పైగా అభివృద్ధి జరుగుతున్నదని చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజల సంఖ్య పెరుగుతున్నదని, దేశంలో 25 కోట్ల మంది మధ్యతరగతి వారుంటారని అంచనాలు వెల్లడౌతున్నాయి. అటువంటపుడు ఆదాయపు పన్ను చెల్లించేవారి సంఖ్య ఇంత తక్కువగా ఉండటానికి చట్టాలలో ఉన్న లొసుగులే కారణం. ప్రభుత్వం చట్టాలను సవరించి, కార్పొరేట్ పన్నును, వ్యక్తిగత ఆదాయపు పన్నును పటిష్టంగా వసూలు చేయటానికి పూనుకుంటే ప్రత్యక్షపన్నుల వసూళ్ళు బాగా పెరగటానికి అవకాశం ఉంది. దేశంలో ఒక్క శాతం మంది వద్ద 53 శాతం సంపద ఉన్నదని ప్రభుత్వం చెబుతున్నది. మరి పన్నుల చెల్లింపులో వారి వాటా ఎంత? వాస్తవంగా దేశంలో వసూలు చేస్తున్న మొత్తం పన్నుల్లో వారి వద్ద నుండే 60-70 శాతం పన్నులను వసూలు చేయవచ్చు. కాని మొత్తం ఆదాయ పన్ను వసూళ్ళే 55 శాతం కూడా లేవు.

ఆదాయ పన్నును కూడా క్రమానుగతంగా పెంచి వసూలు చేయాలి. ఉద్యోగాలు చేస్తున్న సాధారణ మధ్యతరగతి వారికి భారం కాకుండా ఉండేలా, పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా పెద్ద మొత్తంలో సంపాదిస్తున్న వారిపై ఎక్కువ పన్నులను విధించాలి. బడా కార్పొరేట్, బహుళజాతి సంస్థలపై పెద్ద మొత్తం పన్నులు వేయాలి.

ఇదేమి న్యాయమబ్బా

ప్రస్తుతం ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. పన్నులు వేయాల్సిన వారికి రాయితీలిస్తూ, రాయితీలివ్వాల్సిన వారిపై పన్నులు వేస్తున్నారు. కార్పొరేట్, బహుళజాతి సంస్థలపై అధిక పన్నులు వేయాలి. కాని ప్రభుత్వం వారికి పెద్దమొత్తంలో పన్ను రాయితీలు ఇస్తున్నది. 2016-17 బడ్జెట్‌లో వీరికి ప్రయోజనం కలిగే విధంగా 6 లక్షల 11 వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలను ఇచ్చింది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత



మూడు బడ్జెట్‌లలో కలిపి 17 లక్షల 15 వేల కోట్ల రూపాయల పన్ను రాయితీలను ఇచ్చింది.

ఏం చేయాలి

మన దేశస్తులు ఏఏ దేశాలలో తమ అక్రమ సంపాదనను దాచుకొంటున్నారో ఆ దేశాల ప్రభుత్వాలతో మన ప్రభుత్వం సంప్రదించాలి. ఆ దేశాలలో ఉన్న అకౌంట్ల వివరాలన్నింటినీ తీసుకోవాలి. వాటిలో అక్రమంగా సంపద తరలించిన వారి ధనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించాలి. వివిధ దేశాలతో చేసుకున్న డబుల్ టాక్స్ ఎవాయిడెన్స్ ఒప్పందాలను సమీక్షించాలి. పన్నులు కట్టకుండా తప్పించుకోవటానికి ఉన్న లొసుగులను సరిచేయాలి. దేశంలో కార్పొరేట్, బహుళజాతి సంస్థలు, బడా పెట్టుబడిదారులు పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్న దారులను మూసివేయాలి.

ఏమేం చేయవచ్చు

విదేశాలలో ఉన్న నల్లధనం మొత్తాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వానికి నిధుల కొరత ఉండదు. ప్రభుత్వం వద్ద అవసరమైనన్ని నిధులుంటాయి కాబట్టి విదేశీ పెట్టుబడుల కోసం వెంపర్లాడుతూ, విదేశీ పెట్టుబడులకు పెద్దమొత్తం రాయితీలు ప్రకటించాల్సిన అవసరం ఉండదు. ఆ నిధులతో మనకు అవసరమైన పరిశ్రమలను నిర్మించటానికి, దేశంలో దారిద్ర్యాన్ని నిర్మూలించటానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాల నాణ్యతను పెంచి, విస్తరించి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావచ్చు. కాని ఈ ప్రభుత్వాలకి ఆ సంకల్పం లేదు. నల్లధనవంతులతో నిండి వున్న, వారి మద్దతుపై ఆధారపడివున్న ప్రభుత్వాలు ఆ పని చేయలేవు. ✦

సూటు బూటు రైతు

కొత్త బట్టలేసుకుని పొలంలోకి దిగకురా అంటే మా మనవడు అస్సలు వినడహే అని విసుక్కుంటారు గ్రామాల్లో తాతలు. వీళ్లకు జపాన్‌కు చెందిన రైతు కియోటో సైటో గురించి చెబితే ఓరీ ఈడి షోకు సుబ్బరంగానూ అనేస్తారు. మనోడు పొలం పనికి సూటూ బూటూ వేసుకుని వెళ్తాడు మరి. అదీ రకరకాల షోకులతో. కెంగో ప్రాంతంలో ఇతగాడి తాత ముత్తాతలు 400 ఏళ్లుగా వ్యవసాయం సాగిస్తున్నారు. కియోటోకి మాత్రం మొదట్లో అది అంతగా నచ్చక నగరానికి పరుగెత్తాడు. కానీ కొన్నేళ్లకే సొంతూరికి వచ్చేశాడు. కుటుంబ వృత్తి అయిన వ్యవసాయంపైనే మనసు మరలింది. కానీ సిటీ షోకులు బాగా అంటేశాయి. అయినా నీట్‌గా టై కట్టుకుని సాగు ఎందుకు చేయకూడదని అలాగే ట్రాక్టర్ ఎక్కి దుక్కి దున్నాడు. తొలుత అందరూ నవ్వుకున్నారు కానీ ఇప్పుడు మాత్రం ఇతడి స్టైల్‌కు ముచ్చట పడిపోతున్నారు.

వింత లోకం

బంగాళా దుంప నుంచి జున్నును తీసే పద్ధతిని కనిపెట్టాడు ఆస్ట్రేలియాకు చెందిన ఆండ్రూ డైహిన్. 'పొటాటో మేజిక్' కంపెనీ పెట్టేసి దుంప జున్ను అమ్మేయాలని చూస్తున్నాడు. 12 ఏళ్ల పాటు పరిశోధించి మరీ ఈ ఆహార ఉత్పత్తిని తయారు చేశాడు. చాటో అని పిలిచే ఇది జున్ను గడ్డలానే ఉంటుంది. ఏమేమి కలిపి ఏమేమి చేసి ఇలా తయారు చేస్తున్నాడో మాత్రం బయటకు వెల్లడించడంలేదు. వ్యాపారంలో పోటీ పెరిగిపోతుందనేమో. జున్నే కాదు డెయిరీ ఉత్పత్తులు లేకుండా పాలు, కలకండ, ఐస్ క్రీమ్ వంటివి మొక్కల పదార్థాల ద్వారా తయారు చేసే ప్రయత్నాల్లో విజయం సాధించాడట. దీన్నో సూపర్ ఫుడ్‌గా అభివర్ణిస్తున్నారు. ఆహార భద్రతకు బంగాళ దుంపలు సరైన పరిష్కారమని వాటితో పలు రకాల ఆహారోత్పత్తులు చేస్తే మేలని భావిస్తున్నాడు ఆండ్రూ. చాటో భవిష్యత్తులో ఎంత మార్పు తేనుందో ఇప్పుడే చెప్పలేం.

దుంప జున్ను



మేఘాల్లో సంగీతం

బుల్లి బుల్లి మేఘాలు మీ ఇంట్లో తేలుతూ ఉంటే..! వాహ్ ఊహే ఎంత బాగుంది. ఈ మేఘాల్లోంచి సంగీతం వస్తుంటే మరీ ఇంత ఊహలొద్దు అని అనకండి. గాల్లో తేలే బ్లూటూత్ స్పీకర్లను రూపొందించారు అమెరికా డిజైనర్ రిచర్డ్ క్లార్క్‌సన్. వాటికి మేఘాల రూపునిచ్చారు. 'మేకింగ్ వెదర్'గా పిలిచే ఈ స్పీకర్లను డచ్ కంపెనీ అయిన క్రీలెవ్ భాగస్వామ్యంతో రూపొందించారు. క్రీలెవ్ లెవిటేటింగ్ టెక్నాలజీకి పేరొందింది. 2014లో 'స్మార్ట్ క్లౌడ్' పేరిట ఓ ప్రాజెక్ట్‌ను మొదలెట్టిన రిచర్డ్ చివరకు 'మేకింగ్ వెదర్'తో సంచలనం సృష్టించారు. శక్తివంతమైన అయస్కాంతాల ద్వారా స్పీకర్లను గాల్లో రెండు అంగుళాల ఎత్తులో తేలేట్టుగా చేయగలిగారు. ఈ మేఘాలు గుండ్రంగా కూడా తిరుగుతాయి. కిందికి పైకి కదులుతూ వాతావరణ విన్యాసాల్ని ఇంట్లో సందడి చేస్తాయి. పాలిస్టర్ ఫైబర్ దొంతరల్లో ఎల్ఈడీ లైట్లను అమర్చి ఉరుములు వస్తున్నప్పుడు ఎలా ఉంటుందో అలా మేఘాల్లో మెరుపులు కనిపించేలా చేయడం మరో విశేషం. సంగీతానికి అనుగుణంగా అవి కదలాడటం మరో గమ్మత్తు. ఇది ఇంకా మార్కెట్‌లోకి రాలేదు. కానీ ధర మాత్రం చాలానే ఉంటుందని ముందే హింట్ ఇచ్చి వదిలేశారు. స్పందన బట్టి మార్కెట్లోకి తెస్తారేమో..!

బస్తర్ బార్డా



భారత్‌లోని ఏ గల్లీలో చూసినా క్రికెట్ బ్యాట్ పట్టుకుని ఆడే పోరగాళ్లే కనిపిస్తారు. కానీ ఛత్తీస్‌గడ్ పన్‌ఖన్‌జోర్‌లో పిల్లా పెద్దా అందరూ ఫుట్‌బాల్ ఆటలో మునిగితేలుతుంటారు. ప్రపంచ ఖ్యాతి గడించిన క్రీడని గ్రామస్థులకి పరిచయం చేసింది దిలీప్ బసురాయ్(71). పాన్‌ఖన్‌జోర్ బ్లాక్‌లోని 130 గ్రామాలకి చెందిన ప్రజలు ఇతన్ని బార్దా (పెద్దన్న)గా పిలుస్తారు. ఇక చిన్నారులకు తను ఫుట్‌బాల్ వాలే గురూజీ. ఇక్కడ జరిగే సాయుధ పోరాటాలు, పోలీస్ చర్యల వల్ల చిన్నారుల జీవితాలు ప్రభావంలో పడుతున్నాయి. వీటికి దూరంగా ఉంచేందుకు విలువైన బాల్యాన్ని కాపాడేందుకు బార్దా ఆటల మార్గాన్ని ఎంచుకున్నాడు. ఫుట్‌బాల్‌లో జాతీయస్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతూ జీవిత కాలాన్ని ఫుట్‌బాల్ బోధనకు అంకితమిచ్చాడు.

ఛత్తీస్‌గఢ్‌లో జిల్లా కేంద్రంగా ఉన్న కాన్కెర్ నుండి 130 కి.మీ. దూరంలో ఉన్న పన్‌ఖన్‌జోర్‌లో ఉంది బస్తర్ గ్రామం. పశ్చిమ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారుల స్ఫూర్తితో 1970లో మోహన్ బగన్, చుని గోస్వామి, దిలీప్ బసురాయ్ ఫుట్‌బాల్ ప్రాక్టీస్ మొదలు పెట్టారు. వీరితోపాటు ఈ ఆటపై ఆసక్తితో కొందరు స్థానిక ఆదివాసీలు ఆటలో భాగస్వామ్యులయ్యారు. యుద్ధం కారణంగా బంగ్లాదేశ్ నుండి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన వందలాది కుటుంబాల్లో బసురాయ్‌లు ఒకరు. 1971లో అప్పటి భారత ప్రధాని ఆదేశాల మేరకు తక్కువ జనాభా ఉన్న బస్తర్‌లో బసురాయ్‌లు ఆశ్రయం పొందారు. నలువైపులా దట్టమైన అడవుల్ని కలిగున్న ఈ ప్రాంతంలో ఉరవు, గోండు తెగలతో పాటు అప్పటికే అక్కడున్న ప్రజలు కొత్తగా వచ్చిచేరిన బెంగాలీ కుటుంబాలతో పది వేలుగా ఉంటుంది అక్కడి జనాభా. ఈ ప్రాంతానికి చెందిన పన్నెండు మంది ఆదివాసీలతో 1980లో ఒక ఫుట్‌బాల్ జట్టును తయారుచేశాడు బసురాయ్. కొన్నాళ్లకు బస్తర్ సాయుధ పోరాటాలకు, కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. పన్‌ఖన్‌జోర్‌లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య నిత్యం జరిగే కాల్పుల, వారి ఆంక్షలకు ఇక్కడి ప్రజలు తల్లడిల్లేవారు. ఇలాంటి తీవ్ర పరిస్థితుల్లో ఫుట్‌బాల్ క్రీడ ద్వారా చిన్నారులకు సాంత్వన కలిగించేందుకు కృషిచేశాడు దిలీప్. సాయంత్రం వేళల్లో ఈ ఆటని ఎక్కువగా ఆడుకునేవారు. ఆదివాసీ తెగలు కూడా ఈ క్రీడని ఇష్టపడడంతో తక్కువ కాలంలోనే చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అనతి కాలంలోనే అందరికీ చేరువయ్యింది. విధ్వంసం నుండి బాల్యాన్ని శాంతి

వైపునకు మరల్చేందుకు ఈ క్రీడ ఎంతగానో దోహదపడింది. ఫుట్‌బాల్ క్రీడతో గ్రామస్తుల జీవన శైలిలో మార్పు తెచ్చిన దిలీప్ బసురాయ్‌ని అక్కడి పెద్దలందరూ బార్దా (పెద్దన్న)గా పిలుస్తూ తమవాడిని చేసుకున్నారు. హింసాత్మకమైన ఘటనల వొరవడికి చిన్నారుల మనసులు ప్రభావితం కాకుండా వారిని ఫుట్‌బాల్ క్రీడ వైపు మరల్చాడు దిలిప్ బసురాయ్. ఇప్పటికీ అక్కడ విధ్వంసం కొనసాగుతోంది. గత మూడేళ్లుగా ఇక్కడి భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన 200 ఎన్‌కౌంటర్‌లకి ఇక్కడి ప్రజలు ప్రత్యక్ష సాక్షులు. విధ్వంసం ద్వారా కలిగే తీవ్ర పరిణామాలకి, భావోద్వేగాల నుంచి ఆక్కడి ప్రజలకు కాసింత ఉపశమనాన్ని కలిగించడంలో ఒక రకంగా ఫుట్‌బాల్ క్రీడ దోహదపడిందనే చెప్పాలి. వార్తా పత్రికలని చదివే సమయంలోనూ ముందుగా ఫుట్‌బాల్ క్రీడకి సంబంధించిన వార్తలనే తెలుసుకునేందుకు ఇష్టపడుతుంటారు చాలామంది స్థానికులు. ఫుట్‌బాల్‌లో చిన్నారులకి శిక్షణ ఇవ్వడమే కాకుండా తన పింఛన్‌ను కూడా శిక్షణకే ఖర్చుచేస్తున్నారు దిలీప్ బసురాయ్.

ప్రస్తుతం పన్‌ఖన్‌జోర్ బ్లాక్‌లో పాఠశాల స్థాయిలో 96 జట్ల ఫుట్‌బాల్ క్రీడాకారులున్నారు. ఇక్కడ ఆశ్చర్య కరమైన విషయం ఏమిటంటే వీరిలో 40 కంటే ఎక్కువ బాలికల జట్లే ఉన్నాయి. బాలుర కంటే బాలికలు ఈ క్రీడలో మరింతగా ఆరితేరుతూ జాతీయస్థాయి పోటీలను చేరుకునేలా కసరత్తు చేస్తున్నారు. వీరిలో చాలా మంది ఆదివాసీ తెగలకి చెందిన పిల్లలే. ఫుట్‌బాల్‌నే సర్వస్వంగా భావించే ఈ ప్రాంతం నుంచి కపిల్, బురున్ షీల్ లాంటి రాష్ట్ర స్థాయి క్రీడాకారులతో పాటు నవోదయ విద్యాలయ నుండి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు సందీప్ బిస్వాస్ లున్నారు. ఇప్పుడిప్పుడే దేశంలో ఫుట్‌బాల్‌కు ఆదరణ పెరుగుతోంది. కానీ ఈ ప్రాంతంలో వందకు దగ్గరలో జట్లు తయారయ్యాయంటే మామూలు విషయం కాదు. అదీ ఓ వెనుకబడిన ప్రాంతంలో ఇలా ఓ ఆట ద్వారా యువత సరైన గాడిన నడిపించాలనే ఆలోచన అభినందనీయం.

– శారద

శాంతి

అద్దె కుటీరాలు

హౌరా స్టేషన్ నుంచి శిప్రీ ఎక్స్‌ప్రెస్ ఉదయం ఎనిమిదిన్నరకు బయలుదేరింది. రైల్లో ప్రయాణీకులు మరీ ఎక్కువగా లేరు. దారిలో పచ్చటి పొలాలను, బేలూర్, తలండూ, మెమరి, బర్ధమాన్ జంక్షన్ లాంటి చిన్నా పెద్దా ఊళ్ళను దాటుకుంటూ మూడు గంటల ప్రయాణం తర్వాత బోల్పూర్ జంక్షన్‌కు చేరుకుంది. అంతకు ముందు పని ఒత్తిడితో పరుగులు పెడుతూ ఉండిన నా యాంత్రిక జీవితం ఒకింత సేద దీరడం మొదలయ్యింది.

బోల్పూర్ స్టేషన్ పరిశుభ్రంగా, పొందికగా కనిపించింది. శాంతినికేతన్ పొల్యూషన్ ఫ్రీ జోన్ అవ్వడం వల్ల మోటారు వాహనాలకు ఆ పరిసరాల్లో అనుమతి లేదు. అందువల్ల రిక్షాలో అరగంట ప్రయాణం తర్వాత శాంతినికేతన్ చేరుకున్నాను. అక్కడే విశ్వ-భారతి విద్యాలయం ఉంది. శాంతినికేతన్, విశ్వభారతులను పర్యాయ పదాలుగా చెప్పుకోవచ్చు. రిక్షా నడుపుతున్న బెంగాలీ వ్యక్తి పేరు హారూ. నా పర్యటన మొత్తంలో దాదాపు అతనే గైడ్‌గా వ్యవహరించాడు.

మంచి గైడ్..

శాంతినికేతన్ పరిసరాల్లో ఒక రమణీయమైన ఇల్లు కనిపించింది. చక్కటి పూల మొక్కలు, గార్డెన్‌తో చాలా హాయిగా అనిపించింది. ఆ ఇంట్లో ఒక ప్రొఫెసర్ నివాసముంటున్నారని హారూ చెప్పాడు. బెంగాలీ డిపార్ట్మెంటూ, జాగ్రఫీ విభాగము, విశ్వభారతీ భాషా భవన్ మొదలైన సముదాయాలను దాటుకుంటూ ఆశ్రమం(విశ్వ భారతి)లోకి అడుగుపెట్టాను. దగ్గరలో 'ద్విజవిరాం' అనే పేరుతో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఉంది. శాంతినికేతన్ ప్రవేశ ద్వారం దగ్గరి ప్రాంతాలు ఇదివరకు చాలా పరిశుభ్రంగా ఉండేవని, ఇప్పుడు అక్కడి శుభ్రతపై అంతగా దష్టి పెట్టడంలేదని హారూ చెప్పాడు. మన సస్కృతిని ప్రతిబింబించే ఉన్నత ప్రదేశం కొంత నిర్లక్ష్యానికి గురికావడం నన్ను బాధించింది. తమ వారసత్వ చిహ్నాలకి ఎంతో ప్రాముఖ్యతనిచ్చి జాగ్రత్తగా కాపాడుకోవడాన్ని ఇదివరలో అమెరికన్, లండల్లో, స్కాట్లేండ్ మొదలైన దేశాలలో గమనించాను.

చదువు-కళల జోడింపు

దారి పొడవునా హారూ నాకు ఆ ప్రదేశపు వివిధ ప్రాంతాల విశిష్టతను, అక్కడి సంస్కృతి తీరుతెన్నులను చాలా ఉత్సాహంగా వివరించాడు. ఎక్కువగా బెంగాలీ యాసలో మాట్లాడుతూ ఉన్నా మధ్య మధ్యలో హిందీ పదాలు జోడించడం వల్ల అతని భాష నాకు చాలా వరకు అర్థమయ్యింది. మార్గంలో ఒక ఇరవై ఏళ్ళ వయసున్న అమ్మాయి చేతిలో పుస్తకాలతో నడచిపోతూ కనిపించింది. నేను రిక్షా ఆపి ఆమెతో కాసేపు సంభాషించాను.

ఐ.ఐ.టి ఖరగ్పూర్లో 'గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్షిప్ సమిట్'లో పాల్గొన్న తర్వాత ఎంతో కాలం నుంచి నేను సందర్శించాలనుకున్న శాంతినికేతన్ యాత్రకు ఎట్టకేలకు బయలు దేరాను. నా బాల్యంలో మా నాన్నగారు తరచుగా రవీంద్రనాథ్ టాగూర్ గురించి మననం చేసుకుంటూ కవిగా ఆయన ఎంత గొప్పవాడో పిల్లలమైన మాక్కూడా చెబుతూ ఉండేవారు. ఆ ప్రభావం వల్ల నాకు ఆ రోజుల్నుంచే శాంతినికేతన్లో చదువుకోవాలన్న కోరిక ఏర్పడింది. ఐతే ఆ కోరిక, కలగానే మిగిలిపోయింది. కనీసం ఆ విశిష్ట ప్రదేశాన్ని ఒక్క మారైనా సందర్శించాలన్న వాంఛ తీరిపోయింది.

– శివ్

9848527109

ఆమె పేరు 'రూమా' అని చెప్పి
గణితం చదువుతూ ఉంది. చ
కూడా ప్రాధాన్యతనిస్తున్న విధా
నాకనిపించింది. మన విద్యా వ
చేస్తే పరిపూర్ణత కలుగుతుంది.

నీహారి

ప్రముఖ చిత్రకారుడైన
నీహారికా ఆర్ట్ గాలరీని సందర్శి
స్థాపించబడింది. సెలీం మున్సీ
సముదాయంలో ఆ
అప్పటి స్థలాల్
వాటర్ కల
తదితరా
మంద్ర
ముఖ
విన
ప్రజ
భార
సంస
ప్రస్తు
తెలిసిం

బాల
అంతర్ధాన దశకు
ప్రాంగణాన్ని చూసిన తర్వా
మందిర్ అని పిలవబడే ధ్యాన
చాలా ప్రశాంతంగా ఉంది. ఆ
నందలాల్ బోస్‌చే సజియింప
విలక్షణంగా కనిపించింది. గత
బాలుడు పడి మునిగిపోతుంటే
తొండంతో బయటకు తీసి కా
తొండంతో పిల్ల వాడిని పట్టుక
చెక్కబడిందని ఒక కథ ప్రచార
ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, నోబెల్



చెట్ల కింద తరగతులు

కళాభవన్‌లో...



కళా వస్తువుల అంగడి

నికేతన్‌లో ఒక రోజు

ంది. తను శాంతినికేతన్లో ఎమ్మెస్సి
ువుతో బాటుగా లలిత కళలలకు
నంపై చాలా సంతృప్తిగా ఉన్నట్లు
్యవస్థలో కూడా కళలను భాగం

కా ఆర్ట్ గ్యాలరీ

ఎం మున్షీ భార్య పేరు మీద
ంచాను. అది 2005లో
పాత శాంతినికేతన్
రోజుల్లో ఉన్న లాండ్స్కేప్సును
చిత్రించిన తైల వర్ణ చిత్రాలు,
ర్ పెయింటింగ్స్, పెన్సిల్ స్కెచెస్
లతో తీర్చిదిద్దారు. గ్యాలరీలో
స్థాయిలో హేమంత
ోపాధ్యాయ గానం ఆహ్లాదకరంగా
వస్తూ ఉంది. సెలీం మున్షీ
్ఞావంతుడైన శిల్పి కూడా. విశ్వ
తిలో దాదాపు నలభై
త్సరాలు ఆచార్యునిగా పనిచేసి
తం విశ్రాంతి తీసుకుంటున్నారని
ది.

ఏనుగు-పిల్లవాడి కథ

రు, బాలికల వసతి గహాలను,
ేరిన భాషల కేంద్రం (సీఈఎఫ్ఎల్)
త శ్రీ ఆరబింద నిలయ మాత్రి
మందిరాన్ని చేరుకున్నాను. లోపల
శ్రమ ప్రాంగణంలో ప్రముఖ శిల్పి శ్రీ
ిడిన ఒక ఏనుగు శిల్పం
ంలో దగ్గరలో ఉన్న తటాకంలో ఒక
ఆ పిల్లవాణ్ణి ఈ ఏనుగు తన
ాడిందని, ఆ సంఘటనకు గుర్తుగా
ని ఉన్న ఏనుగు బొమ్మ
లో ఉంది. ఆ ఆవరణలోనే
బహుమతి గ్రహీత ఐన అమర్త్య

సేన్ మామగారైన శ్రీ జి.ఎం సేన్‌కు చెందిన ఇల్లు ఉంది. అక్కడే హిందీ భవన్లో మన మాజీ ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ విద్యనభ్యసించిన స్థలం, అప్పుడుపయోగించిన బ్లాక్ బోర్డ్ తదితర ఆనవాళ్ళున్నాయి. అక్కడి ఆనంద పాఠశాలలో 4-5 సంవత్సరాల వయసున్న పిల్లలకు చదువు నేర్పిస్తారు.

తీన్ పహాడ్

రవీంద్ర కవీంద్రుడు కవితలు రాసిన ఒక స్థలాన్ని తీన్ పహాడ్ అంటారు. మూడు కొండలు చుట్టుతా ఉండడం వల్ల ఆ ప్రదేశానికి ఆ పేరు వచ్చింది. 'రబీంద్రనాథ్ ఇధర్ కొబితా లిఖా థా' అని హారూన్ ఒక తాదాత్మ్య భావనతో చెప్పాడు. ఆ స్థలంలో నిలబడ్డప్పుడు నేను కూడా ఒక వర్ణించనలవికాని ఉద్విగ్నతకు లోనయ్యాను. కళాభవన్, సంగీత భవన్‌లతో పాటు అక్కడే నల్ల రంగులో ఉన్న బ్లాక్ హవుస్ ఉంది. దాని గోడల మీద మట్టి సహాయంతో శ్రీ నందలాల్ బోస్ వేసిన చిత్రాలున్నాయి. అక్కడ శిల్పకళనభ్యసిస్తున్న కొందరు విద్యార్థులతో నేను మాట్లాడాను. అక్కడ ఉన్న చాతీం వృక్షం కింద కూర్చుని టాగూర్ రచనలు చేశారట.

రవీంద్రుని విగ్రహం



బెంగాలీ భోజనం

నేను, హారూన్ కలిసి అక్కడ ఉన్న ఒక రెస్టారెంట్లో భోజనం ముగించాము. శాఖాహార భోజనానికి వంద రూపాయలు తీసుకున్నారు. నెయ్యి, గొబిందో భోగ్, చలెర్ భాత్, దాల్, అలూర్ ఝురి భజ, షుక్తో, ధోకర్ దల్నా, మామిడి చట్నీ వడ్డించారు. మనకు ఎన్ని సార్లు కావాలన్నా వడ్డిస్తారు. తృప్తిగా భోంచెయ్యవచ్చు. ధోకర్ దల్నా అనే పదార్థం చాలా రుచిగా ఉన్నది. అంతేకాక ఎగ్ కర్రి/కొష, కట్ల చేప, షోర్షే ఇలిష్, పబ్దా, చికెన్, మటన్, ప్రాన్స్ మలై కర్రి లాంటి మాంసాహార వంటకాలను అదనపు సొమ్ము చెల్లించి తినొచ్చు.

రవీంద్ర మ్యూజియం

భోజనానంతరం నేను రవీంద్ర మ్యూజియంలోకి అడుగుపెట్టాను. శాంతినికేతన్‌లో యాత్రీకులు ఎక్కువగా సందర్శించేది రవీంద్ర మ్యూజియాన్నే. ప్రతి రోజూ ఐదారు వందల మంది సందర్శకులు వస్తుంటారని మ్యూజియం నిర్వాహకులు చెప్పారు. అన్ని విభాగాలను వివరంగా చూడాలంటే రెండు మూడు గంటలకుపైగా సమయం పడుతుంది. టాగూర్ వంశ వ క్షం వివరాలు, సాహిత్యంలో మహా కవికి నోబెల్ బహుమతి సాధించి పెట్టిన అప్పటి గీతాంజలి ప్రతి. రవీంద్రుడు మలేషియా, మాస్కో, షికాగో, జావా, జపాన్, యూరోప్ ఇంకా ఇతర దేశాలు, స్థలాలు సందర్శించినప్పుడు దిగిన ఛాయా చిత్రాలు, ఆయన చేసిన కలప కళాఖండాలు, తైలవర్ణ చిత్రాలు, వాడిన బూట్లు, శాంతినికేతన్, శ్రీ నికేతన్ స్థాపించిన తొలినాళ్ళలోని వివరాలు, ఫోటోలు, సైటేషన్ ఆఫ్ నోబెల్ ప్రైజ్ బై స్వీడిష్ అకాడెమీ, అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబించే ఛాయా చిత్రాలు, నందలాల్ బోస్ గీసిన చిత్రాలు, టాగూర్ గీసిన ఫేస్ ఆఫ్ మాన్, ఫేస్ ఆఫ్ వుమన్, సెల్ఫ్ పోర్ట్రెయిట్, కాంఫ్లుయెన్స్ ఆఫ్ మైండ్స్ అన్న పేరుతో గాంధీ, కస్తూర్బా, ఐన్‌స్టీన్, సిగ్మండ్ ఫ్రాయిడ్, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, హెలెన్ కెల్లర్ మొదలగు ప్రముఖులతో టాగూర్‌కున్న అనుబంధాన్ని తెలిపే ఛాయా చిత్రాలు ఉన్నాయి. ఆయన జీవితంలో ఆఖరి రోజైన 25 జూలై 1941 గురించిన వివరాలున్నాయి. టాగూర్ వాడిన కారు కూడా మ్యూజియం ఆవరణలో భద్రపరచబడి ఉంది. మరొక చిన్న భవనంలో రవీంద్రనాథ్ కుమారుడైన రతీంద్రనాథ్ మ్యూజియం ఉంది. ఆయన కూడా చిత్రకారుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. మ్యూజియంలోంచి టాగూర్‌కు లభించిన అసలైన నోబెల్ పతకాన్నీ, ఇంకా కొన్ని విలువైన వస్తువులను దుండగులు దొంగిలించారని విన్నప్పుడు ఆవేదన చెందాను. ఇప్పుడు వాటి స్థానంలో ఉన్నవి రెప్లికాలు మాత్రమే.



శాంతి నికేతన్‌లో వ్యాసకర్త



బెంగాలీ నృత్యగీత ప్రదర్శన





టాగూర్ వాడిన కారు



పునశ్చ గృహం

కవిత్వమ్

మనిషిది ప్రకృతిదీ ఓ ఆత్మీయ బంధం

వాన ధారగా పడుతోంది
గుడిసెల సందుల్లో నుండి చిన్ని చిన్ని కాలువలు
తల్లి ఎద మీద పండిన చంటోడు
వెచ్చదనాన్ని వెతుకుతున్నాడు
వాడి కళ్ళలో అనంతమైన ప్రశ్నలు
ప్రకృతి విలయంలోను శిశువుకు తల్లి పొత్తిళ్ళే లోకం
ఆ కడలి మీద పడవ
ఒడ్డు వేపుకు పడివడిగా వస్తుంది
దీపం పట్టుకు నిలుచున్న సతి
కళ్ళల్లో వెయ్యి దీపాల కాంతి.
వేటకు వెళ్లేటప్పుడు చెయ్యి వూపింది
వేట నుండి వచ్చేటప్పుడూ చెయ్యి వూపింది.
ఆమె నిబ్బరం అంతులేనిది
అవును! ఆత్మీయతలు, అంత: సంబంధాలను
తుఫానులు ఛేదించలేవు
మబ్బుల వతలున్న సూర్యుడి కోసం
ఆ గులాబీ దిగాలు పడింది
అవును! చినుకుల చప్పుడు వేరు, అలల చప్పుడు వేరు
కొన్ని స్వరాలు చీకటి పొరల్ని చీల్చుకొని
గుండెకు చేరుతాయి
ఆ పాటల్లోని మాధుర్యం వల్లీతీగలా అల్లుకొంటుంది
మొక్కల వేరులకు చినుకులు ఆయువు పోస్తున్నాయి
ఇసుక తిన్నెలన్నీ దాహార్తిని తీర్చుకొంటున్నాయి
ప్రకృతి అల్లుకొంటుపోతుంది
మనిషికి, మనిషికి మధ్య అనుబంధాలదొక ప్రశ్న
ఆ పడతి తన సంపదను పోసి ఆ గూడు నిర్మించుకొంది
వెచ్చని పడకను సంపాదించుకొంది
ఆమె తోడును నిరాకరించింది
సిమెంటు గోడలు ఆమెను సజీవం చేయగలవా
ఆమె నిర్లక్ష్యం ఆమెకు అహం తెచ్చింది
చుట్టు వున్న శునకాలు తోడు కోసం మూలుగుతున్నాయి
తోడు సజీవమైందని ఆమెకు
చినుకులు గుర్తుచేయలేకపోయాయి
తోడు ఆమెకు భారం
అందుకే ఆమె శిలా సదృశ్యం అవుతోంది
నీటి చినుకులు ఆ శిల మీదుగా జారిపోతున్నాయి
ఆ శిలా ప్రతిమ కనుకొలకుల మీద కూడా
ఒక చినుకు నిలబడింది
ఆమెకు కన్నీటికి భాష్యం చెప్పింది
అవును! ఆ బోధ కూడా వర్షాకాశం వంటిదే!
అక్షర దివ్వెలు అనేక గుండెలను
వెలిగిస్తూ వెళుతున్నాయి
ఏదైనా, శృతిబద్ధమైంది
మెదడును తాకుతుంది
ఒంటరితనం నుండి సమూహానికి
సమూహం నుండి ఒంటరితనానికి
వారధిని నిర్మించేది సంగీతమే
మానవ సంబంధాల మధ్య
నీటి ధారే కాదు, ప్రేమ ధార కూడా వుంది
త్యాగం దానికి ఇరుసు
త్యాగం లేని ప్రేమ నిరర్థకమవుతుంది
అవును! ఆమె నిశ్శబ్దంగానే వుంది
ఆ నిశ్శబ్దం వెనుక కడలి తరంగాలున్నాయి
పూలవనాలు వున్నాయి
ముళ్ళపొదలూ వున్నాయి
మూగబోయిన వారంతా ఈ లోకానికి
ఏదో చెప్పాలనే ఆరాటపడుతున్నారు
లోకం మూగదవుతున్న కొలది
భావాలు అవ్యక్తంగానే వున్నాయి
ఆ వాగులు తెగి పొంగి పొర్లుతున్నాయి
ఊళ్ళకు ఊళ్లు జలమయమవుతున్నాయి
ఏ గట్టు బలంగా లేదు
మబ్బులు నల్లగా మళ్ళీ వర్ష సంకేతాలిస్తున్నాయి
మనిషి, ప్రకృతిఅతివ్యాప్తి, అవ్యాప్తికి గురవుతున్నారు
సమతుల్యతే సముత్తేజాన్నిస్తుంది
మనిషిది, ప్రకృతి ఆత్మీయ బంధం సుమా!

– డాక్టర్ కత్తి పద్మారావు

989741695

కొనేయ గలిగే వాడు గొప్పోడైనాక

కొనేయ గలిగే వాడు గొప్పోడైనాక
అమ్ముకునే వాడు అల్పుడే అవుతాడు
న్యాయాన్ని దాయగలిగే శక్తి అన్యాయానికి
అబ్బినప్పుడు
అన్యాయాన్ని కొనుక్కునేంత సంపద ఒకే చోట
కుప్పగైనపుడు
సాక్షులను (న్యాయాన్నీ) సంతల్లో
కొనుక్కోవడం,సాధ్యమే కదా
కోర్టులనూ(ఆలోచనా పరులనూ) బురిడీ
పెట్టించడం కష్టం కాదు కదా ?
సంపదతో నెట్టుకొస్తున్న మాధ్యమాలూ ఉన్నయ్
అన్యాయానికి నీతి రంగులు పులుమేస్తూ
వలలేస్తాయ్
సాక్షులు మార్కెట్ సరుకు
మనిషే మార్కెట్ సరుకు
మనసూ మార్కెట్ సరుకైపోయింది
కొనగలిగే శక్తి అబ్బినాక
కొనుక్కునే వాడికి దొరకందేంటి ఈడ
మట్టీ,మహిమా,శక్తీ, శౌర్యం,శాసనం అన్నీ
మానం, ప్రాణం, మౌనం,మనసూ,మమత ఇంకెన్నో
కొనేయ గలిగే వాడు గొప్పోడైనాక
అమ్ముకునే వాడు అల్పుడే అవుతాడు
తార్పుడు తత్వం తలల్లోకి ఎక్కేసినాక అలలై
పిత్తపరిగలే వలకు చిక్కేది,న్యాయ నిలబాటు
ఋజువుకు

– తిక్త

పవర్ బిల్డర్

విజేత

మిస్టర్ ఇండియా టైటిళ్లు, పవర్ లిఫ్టింగ్ స్వర్ణాలు సాధించింది ఒక్కడే. బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతూ ఆ క్రీడలకు దేశంలో ఆదరణ పెంచేందుకు ప్రయత్నిస్తున్నాడు. తనలాంటి బిల్డర్లను తయారు చేస్తున్న అతన్ని అభిమానులందరూ గురూజీ అని ముద్దుగా పిలుస్తుంటారు. అతడే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భారత బాడీ బిల్డర్ ముకేశ్ సింగ్ గెహ్లోట్. దాదాపుగా 15 ఏళ్ల అద్భుత విజయాలతో బాడీ బిల్డింగ్‌లో సత్తా చాటాడు. ఇటీవలే ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో రెండో స్వర్ణంతో మెరిశాడు.



ముకేశ్ క్రీడా కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినవాడే. ఢిల్లీలోని ద్వారకామండి సమీపంలోని కకురోలా గ్రామంలో 1978 మే 31న జన్మించాడు. తండ్రి రైజింగ్ సింగ్ రైతు. తల్లి శ్యామాదేవి గృహిణి. చిన్నతనం నుంచి ముకేశ్‌కు క్రీడలంటే ప్రాణం. ఇంజినీరింగ్‌లో కెరీర్ మలచుకోవాలని కోరుకునేవాడు. ఉన్నత చదువులపైనే ధ్యాస ఉంచాలని కుటుంబమంతా కూడా చెప్పేది. అందుకే చదువును ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు.

ద్రోణాచార్యుని సాన

ఎప్పుడు ఫిటెనెస్‌తో ఉండాలని కోరుకునే ముకేష్ 1997లో 19 ఏళ్ల ప్రాయంలోనే ద్రోణాచార్య అవార్డు గ్రహీత భూపేందర్ సింగ్ దావన్ వద్ద బాడీ బిల్డింగ్‌లో శిక్షణ మొదలెట్టాడు. వారంలో ఆరు రోజుల కఠోర శిక్షణకు సమయం కేటాయించేవాడు. ఆ ఏడాది ఢిల్లీ రాష్ట్రంలో తొలిసారిగా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని అందర్నీ ఆశ్చర్యపరచి విజేతగా నిలిచాడు. ఐదుగురు అన్నయ్యలు తర్వాత పుట్టిన వాడు. వారి అన్నదమ్ముల్లో ముగ్గురు పోలీస్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 1997లో ఢిల్లీ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. ఆ తర్వాత కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకోని విధంగా మలుచుకున్నాడు. 2000లో భూపేందర్ సింగ్‌ను ద్రోణాచార్య అవార్డు వరించింది. అది ద్రోణాచార్య జిమ్‌గా పేరుగాంచింది. దేశ వ్యాప్తంగా 165 శాఖలకు విస్తరించటం విశేషం. అదే ఏడాది ముకేశ్ కూడా గురువును అనుసరించి సొంతంగా జిమ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం మొదలెట్టాడు. అది అతని కెరీర్‌కు ఆర్థిక చేయూతకు ఉపకరించేది. ఆరేళ్ల పాటు 2004 వరకు రైల్వేలో ఉద్యోగం చేశాడు. దీంతో పూర్తి స్థాయి శిక్షణ పొందడానికి అవకాశం లేకపోవడంతో ఉద్యోగం వదిలేసి పూర్తిగా జిమ్ నిర్వహణా వ్యాపారంపైనే నిలదొక్కుకుని కుటుంబ పోషణ సాఫీగా సాగిస్తున్నాడు.

700 కేజీలెత్తి..



ముకేశ్ సింగ్ గెహ్లోట్

ముకేశ్ కెరీర్‌లో స్థిరపడటానికి అతని పెద్ద అన్నయ్య కుల్వీర్ సింగ్ తోడ్పాటు అందించాడు. జిమ్‌లో డైట్‌కు డబ్బులను అందించడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపాడు. 1997–2013 వరకు 15 ఏళ్లపాటు బాడీ బిల్డర్‌గా సత్తా చాటిన ముకేశ్ జీవితంలో మార్పు కోరుకున్నాడు. పవర్ లిఫ్టింగ్ వైపు మళ్లాడు. 2013లో హాలెండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 125 కేజీల విభాగంలో 700 కేజీల బరువెత్తి చరిత్ర సృష్టించాడు. ఓవరాల్ ప్రతిభలో సిల్వర్ మెడల్‌ను చేజిక్కుంచుకున్నాడు. తాజాగా ఈ నెలలో ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండో స్వర్ణంతో ముకేశ్ సత్తా చాటాడు. భారత్ తరఫున ప్రొఫెషనల్ పవర్ లిఫ్టర్‌గా పలు టోర్నీలకు ప్రాతినిధ్యం వహించాడు. రెండు క్రీడలకు సమప్రాధాన్యత ఇస్తూ దూసుకెళ్తున్నాడు.

కకురోలా బిల్డింగ్..

తన ఊళ్లో మిగతా బాడీ బిల్డర్‌లకు ముకేష్ సింగ్ తన వంతు సహకారం అందిస్తున్నాడు. 25 నుంచి 30 మంది బిల్డర్లకు పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నాడు. అతని శిష్యులు ట్రైనర్‌లుగా ఎదిగి జిమ్‌లను నిర్వహించుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. తల్లిదండ్రులు బాడీ బిల్డింగ్ వైపు ఆసక్తి కనపరిచే యువకులకు ప్రోత్సాహమిస్తే వారు ముకేశ్‌లా విజేతగా నిలుస్తారు. నాన్ ఒలింపిక్ స్పోర్ట్స్‌గా ఉన్న పవర్ లిఫ్టింగ్‌కు ప్రభుత్వం ఆర్థిక చేయూత, సౌకర్యాలు కల్పించాలనేది ముకేశ్ కోరిక. తన విజయాలతో ఆ క్రీడకు దేశంలో మంచి ప్రచారం తేగలననేది ఆయన విశ్వాసం.

– ఈశ్వర్ నెట్టెం

కథ

చీకటిలో చిరుదీపం

-గోనుగుంట మురళీకృష్ణ
9701260448

ఆకాశం మబ్బు పట్టి ఉంది. చల్లటి గాలి వీస్తూ ఉంది. ఇంకాసేపట్లో వర్షం వచ్చేటట్లు ఉంది వాతావరణం. బస్ కోసం ఎదుర్ చూస్తూ బస్ స్టాప్ లో నిలబడి ఉంది యామిని. ఈ మధ్య కొద్ది రోజుల నుంచీ పగలంతా ఎండ మాడ్చేయటం, సాయంత్రానికి వర్షం కురవటం జరుగుతూ ఉంది. విచక్షణారహితంగా చెట్లు కొట్టేయటం వలన జరిగే ప్రకృతి అసమతౌల్యత అది అనుకుంది యామిని.

పక్కనే తన లాగే బస్ కోసం నిలబడిన అతని సెల్ ఫోన్ లోనుంచీ "పగలే వెన్నెల, జగమే ఊయల కదలే ఊహలకే కన్నులుంటే……."పాట వినిపిస్తోంది. అబ్బ! ఇలాంటి మధుర మైన పాటలు విని ఎన్ని రోజులైంది? తెల్లవారి లేచిన దగ్గరనుంచీ పడుకోబోయే వరకూ ఉరుకులు, పరుగులు. ఆదివారం కూడా బట్టలు ఐరన్ చేసుకోవటం, పెండింగ్‌లో ఉన్న పనులు చేసుకోవటం. కాసేపు రెస్ట్ కూడా లేదు.

ఇంతలో సిటీ బస్ వచ్చి ఆగింది. జనంలో ఒక్కసారిగా చలనం వచ్చింది. బస్ ముందువైపు నుంచీ ఆడవాళ్ళు, వెనకవైపు నుంచీ మగవాళ్ళు తోసుకుంటూ ఎక్కారు. బస్ కదిలింది. "వెనక్కు జరగండి. సర్దుకోండి" కండక్టర్ అరుస్తూ టిక్కెట్లు కొట్టసాగాడు. యామిని కొంచెం వెనక్కు జరిగింది. "యామినీ!" అన్న పిలుపు విని వెనక్కు చూసింది. సీట్లో కూర్చున్న ఒకామె నవ్వుతూ చెయ్యి ఎత్తింది. "పద్మినీ! నువ్వా!"నవ్వుతూ పలకరించింది యామిని.

"ఇలా రా! నా పక్కన చోటుంది" పిలిచింది పద్మిని. యామిని జనంలో నుంచీ చోటు చేసుకుని పద్మిని పక్కన కూర్చుంది. "మచిలీపట్నం యల్.ఐ.సి.లో జాబ్ చేస్తున్నావని విన్నానే! విజయవాడ ఎప్పుడు వచ్చావు?" అని నవ్వుతూ పలకరించింది పద్మిని.

"ఇక్కడకు వచ్చి ఆరు నెలలయింది. మా వారు స్టేట్ బ్యాంకు లో క్యాషియర్ అని నీకు తెలుసు కదా! ఆయనకి విజయవాడ ట్రాన్స్‌ఫర్ అవగానే నేను కూడా రాక తప్పలేదు. నీ సంగతులు ఏమిటి? ఏం చేస్తున్నావు? వీడు మీ బాబా?" ఆనందంగా పలకరిస్తూ అడిగింది యామిని.

ఒళ్ళో కుర్చుని ఉన్న మూడేళ్ళ బాబు తల నిమురుతూ "అవును. వీడు మా చిన్నాడు. వీడి కంటే పెద్దవాడు ఉన్నాడు. ఫస్ట్ క్లాస్ చదువుతున్నాడు. మా వారు రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నారు" చెప్పింది పద్మిని.

"మనం కాలేజీలో చదువు అయిపోయిన తర్వాత ఇప్పుడే కలుసుకోవటం. దాదాపు పదేళ్ళు అయింది."

"అవును" అన్నది పద్మిని. కాసేపు ఇద్దరూ కాలేజీ రోజుల్లోని కబుర్లు చెప్పుకున్న తర్వాత " నీకీ విషయం తెలుసా యమినీ! సంజన లేదూ, టెన్త్ క్లాస్ లో మన క్లాస్ మేట్………"

"ఆ…ఆ….పూజారిగారి అమ్మాయి. మనం 'సంజూ' అని పిలిచేవాళ్ళం. ఎలా ఉంది తను?"

"ప్రస్తుతం మెంటల్ హాస్పిటల్ లో ఉంది"

"అయ్యో! ఏమైంది?"

"అది అసలే భయస్తురాలు. పైగా విపరీతమైన మొహమాటం. వాళ్ళ అత్తమామలు, భర్త ఎన్నో హింసలు పెట్టారట. కూర్చుంటే తప్పు, నుంచుంటే తప్పు. గడపదాటి వెళ్ళకూడదు. ఇరుగుపొరుగు వారితో మాట్లాడకూడదు. ఇలా ఎన్నో అంక్షలు పెట్టేవారు. దానికితోడు భర్త డబ్బు మనిషి. పుట్టింటికి వెళ్ళి డబ్బు తీసుకురమ్మని వేధించేవారు. ఈ బాధలు పడలేక సంజనకి మతి చెలించింది"

"టెన్త్ క్లాస్ అయి మనమందరం కాలేజీలో చేరుతుంటే దానికి మాత్రం పెళ్ళి చేసారు. అంత చిన్న వయసులో అసలు పెళ్ళి చేయకూడదే!"

"అవును. ఎవరితో ఎలా ప్రవర్తించాలో ఆ వయసులో అప్పుడే ఎలా తెలుస్తుంది? తర్వాత కొన్ని

నెలలకు వాళ్ల నాన్న హటాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయాడు. ఆ దిగులుతోనే తల్లి కూడా పోయింది. అత్తమామలు సంజనని మెంటల్ హాస్పిటల్ లో చేర్పించి చేతులు దులుపుకున్నారు. వాళ్ళు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు. మొన్నీ మధ్యే వెళ్ళి సంజనని చూసి వచ్చాను. ఎవరినీ గుర్తుపట్టటం లేదు. నువ్వుకూడా వెళ్ళి సంజనని చూసి రావే! ఎంతైనా అది మన చిన్ననాటి స్నేహితురాలు"

"ఇంత తెలిసిన తర్వాత కూడా వెళ్ళకుండా ఉంటానా! రేపు ఆదివారం శలవేగా! వెళతాను, అడ్రస్ ఉంటె ఇవ్వు" అన్నది యామిని.

పద్మిని హ్యాండ్ బ్యాగ్ లో నుంచీ రెండు విజిటింగ్ కార్డులు తీసి ఇచ్చి "ఒకటి హాస్పటల్ ది, మరొకటి మా ఇంటిది. నీకు వీలైనప్పుడు మా ఇంటికి కూడా రా. అదిగో! నేను దిగవలసిన స్టాప్ వచ్చింది" అంటూ లేచి నిలబడింది పద్మిని.

ఆటో ఒక బిల్డింగ్ ముందు ఆగింది. ఆటో లో నుంచీ సంజన, అశోక్ కిందికి దిగారు. అశోక్ ఆటో ఛార్జ్ ఇస్తుంటే, యామిని గేటు పైనున్న "మెంటల్ హాస్పిటల్" అన్న బోర్డ్ వంక చూస్తుంది. ఇద్దరూ గేటు తెరచుకుని లోనికి వచ్చారు. గేటు లోపల పెద్ద వేపచెట్టు శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్నది. చెట్టు కింద ఆఫీసు రూమ్ కాబోలు టేబుల్ దగ్గర ఒక అమ్మాయి కుర్చుని ఉంది. టేబుల్ ఎదురుగా అయిదారు కుర్చీలు వేసి ఉన్నాయి.

"ఎవరు కావాలండీ?" అడిగింది ఆ అమ్మాయి.

"డాక్టర్ గారిని కలవాలి" అన్నాడు అశోక్.

"కబురు చేస్తాను కూర్చోండి" అని "అంజమ్మా!" పిలిచింది ఆ అమ్మాయి.

సుమారు యాభై సంవత్సరాల వయసు ఉన్న లావుపాటి ఆమె వచ్చి "అమ్మా!" అంటూ నిలబడింది.

"డాక్టర్ గారి కోసం ఎవరో వచ్చారు. తీసుకువెళ్ళు" చెప్పింది.

"రండి" దారి తీసింది అంజమ్మ.

అంజమ్మతో పాటు వెళుతూ చుట్టూ చూసింది యామిని. దారికి ఇరుపక్కలా రేకుల షెడ్లు ఉన్నాయి. వాటిల్లో చాలామంది మగవాళ్ళు పాత బట్టలతో, చింపిరి జుట్లతో, పెరిగిన గడ్డాలతో ఉన్నారు. వాళ్ళని చూడగానే మతిచెలించిట్లు తెలిసిపోతూనే ఉంది. యామిని ఎప్పుడూ ఇలాంటి పరిసరాలకు రాలేదు. వాళ్ళని చూస్తూ భయంభయంగా చిన్నగా అడుగులు వేస్తోంది.

అంజమ్మ మేడమీద హాలులోకి తీసుకువెళ్ళి "అయ్యగారూ! మీ కోసం ఎవరో వచ్చారు" చెప్పింది. డాక్టర్ లోపల నుంచీ వచ్చాడు. అశోక్, యామిని నమస్కరించారు. డాక్టర్ కూడా నమస్కరించి "కూర్చోండి" అంటూ సోఫాలో కూర్చున్నాడు. అశోక్, యామిని ఎదురు సోఫాలో కూర్చున్నారు. అది డాక్టర్ గారి ఇల్లులా ఉంది.

"మీకు ఎవరు కావాలి?" అడిగాడు డాక్టర్.

"సంజన అని, నా మిసెస్ ఫ్రెండ్" చెప్పాడు అశోక్.

"ఆమెని ఇక్కడ చేర్పించి చాలా కాలం అయింది. చేర్పించి వదిలేసి వెళ్ళి పోయారు. ఎవరూ లేరు అనుకుని మేమూ ఊరుకున్నాము. ఇన్నాళ్ళు మీరు ఏమయ్యారు?"

"ఉద్యోగ రీత్యా ఎక్కడో దూరంగా ఉన్నాం. ఈ మధ్యనే ఇక్కడకు వచ్చాం. సంజన గురించి నిన్ననే నాకు తెలిసింది. ఆమె నా చిన్ననాటి స్నేహితురాలు" చెప్పింది యామిని.

"సరే! ...అంజమ్మా! వీరిని ఆమె దగ్గరకు తీసుకువెళ్ళి చూపించు" చెప్పాడు డాక్టర్.

వాళ్ళ మాటలు వింటూ నిలబడ్డ అంజమ్మ "రండమ్మా!" అంటూ దారి తీసింది. ముగ్గురూ కిందకు దిగి కుడివైపు షెడ్ దగ్గరకు వచ్చారు. అది విశాలమైన హాలులా ఉంది. అక్కడ దాదాపు ముప్పై మంది ఆడవాళ్ళు ఉన్నారు. అందరి తలలు బోడిగుండ్లులా ఉన్నాయి. నైటీలు వేసుకుని ఉన్నారు. కొంతమంది బల్లల మీద కుర్చుని, కొంతమంది నేల మీద కుర్చుని, పడుకుని, నిలబడి రకరకాల భంగిమలలో ఉన్నారు.

అంజమ్మ తలుపు తాళం తీసి " సంజనా!" అని పిలిచి ఒక ఆమెని తీసుకు వచ్చింది. ఆమె ఒక్కదానికి మాత్రం కొంచెం జుట్టు పెరిగి ఉంది. "సంజూ! నేను నీ స్నేహితురాలిని, యామినిని. గుర్తు పట్టావా?" అడిగింది యామిని. ఆమె మోహంలో ఎలాంటి ఫీలింగూ లేకుండా నిర్వికారంగా నిలబడింది.

సన్నబడి, బలహీనంగా, అనారోగ్య చిహ్నాలతో ఉన్నా, సంజనని యామిని తేలికగానే గుర్తు పట్టింది. ముఖ్యంగా చెంపమీద ఆ పుట్టుమచ్చ గుర్తు పట్టిచ్చింది. ఆ పుట్టుమచ్చని చూసి "నీ పెళ్ళికి ప్రత్యేకంగా బుగ్గన చుక్క పెట్టనవసరం లేదు లేవే" అని స్నేహితులు పరిహాసం చేసేవారు. సంజనని చూస్తున్న యామిని కళ్ళు చెమర్చాయి.

"ఒక్కరికి కూడా జుట్టు లేదేమిటి?" అడిగాడు అశోక్.

" వీళ్ళకి జడ వేసుకోవటం, చీర కట్టుకోవటం కూడా తెలియదు. అది మాకు అదనపు చాకిరీ. అందుకే నైటీలు ఇస్తాం. నెలకి ఒకసారి బార్బర్ వచ్చి జుట్టు కట్ చేసి వెళతాడు. ఈ అమ్మాయికే కొంచెం పెరిగింది. అదీ రేపో, ఎల్లుండో కట్ చేస్తాం" చెప్పింది అంజమ్మ.

"అశోక్! ఇలాంటి వాతావరణం చూస్తుంటే జబ్బు ఏనాటికీ తగ్గదేమో అనిపిస్తోంది. సంజూని మన ఇంటికి తీసుకువెళదాం. నీకేమైనా అభ్యంతరమా?" అడిగింది యామిని.

"నా ఇల్లు నీ ఇల్లు కాదా! నీ ఇష్టాన్ని ఎప్పుడైనా కాదన్నానా?" అన్నాడు అశోక్ భార్య వంక చూస్తూ.

"థ్యాంక్యూ అశోక్. పద డాక్టర్ తో మాట్లాడదాం"

ఇద్దరూ మళ్ళీ డాక్టర్ దగ్గరకు వచ్చారు. యామిని చెప్పిన విషయం విని డాక్టర్ "మీరు ఏమీ అనుకోకుండా ఉంటె ఒక మాట చెప్పనా?" అన్నాడు.

"చెప్పండి" అన్నది.

"ఆమె ఎక్కువ కాలం బ్రతకదు. చచ్చిపోతుంది. బంధువులే వదిలేసి వెళ్ళిపోయారు. మీకెందుకు అనవసరపు రిస్క్? మాకంటే అలవాటు. ఒక ఫ్రెండ్ గా వచ్చారు. దేవుడి మీద భారం వేసి వెళ్ళిపొండి." అన్నాడు.

యమినికి కోపం వచ్చింది. అయినా

తమాయించుకుంది. "అవసరంలో సహాయం చేయటమే కదండీ స్నేహం అంటే! నాకేం కష్టం లేదు" అన్నది.

"సరే! మీ ఇష్టం. మీకు కావాలంటే ఒక హెల్పర్ ని కూడా ఇస్తాం"

" మీ దగ్గర నర్సులు కూడా ఉంటారా?" అడిగాడు అశోక్.

"నర్స్ కాదు. కొంతమందిని జబ్బు ప్రారంభదశలో ఉండగానే దించి వెళ్ళిపోతారు. జబ్బు తగ్గిపోయిన తర్వాత కూడా తీసుకు వెళ్ళరు. అలాంటి వాళ్ళు పనీపాటా చేసుకుంటూ ఇక్కడే ఉండిపోతారు. వాళ్ళలో ఒకరిని పంపుతాను. మీరు జీతం ఏమీ ఇవ్వనవసరం లేదు. రెండు పూటలా భోజనం పెట్టి, బట్టలు ఇస్తే చాలు"

"అలాగే పంపండి" అన్నది యామిని.

"మీరు కిందకి వెళ్ళండి. నేను పంపిస్తాను" అన్నాడు డాక్టర్.

సరే అన్నట్లుగా తల ఊపి, అశోక్, యామిని కిందకి దిగి వచ్చారు. కొద్దిసేపటి తర్వాత ఒక ఆమె సుమారు ముప్పై ఏళ్ల వయసు ఉంటుంది, సంజనను వెంట బెట్టుకుని వచ్చి, "డాక్టర్ గారు నన్ను మీతో వెళ్ళమన్నారు. నా పేరు లక్ష్మి" అన్నది.

అశోక్ ఒక టాక్సీ మాట్లాడాడు. అందరూ బయలు దేరారు.

యామిని బజారు వెళ్ళి నాలుగు రకాల చీరలు తీసుకు వచ్చింది. యామిని సూచనపై లక్ష్మి సంజనకి తలంటి స్నానం చేయించి, తలదువ్వి, కొత్తచీర కట్టింది. తలలో పూలు పెట్టి, చేతికి గాజులు వేసింది. సంజన శుచిగా, శుభ్రంగా ఉంది. మనలోకంలో లేనట్లు ఏటోచూస్తూ పరధ్యానంగా ఉంది తప్ప పిచ్చిగా ఏమీ కనిపించటంలేదు. అటుగా వెళుతూ అది చూసిన అశోక్ "ఇప్పుడు ఈమెను ఎవరైనా చూస్తే మెంటల్ హాస్పిటల్ నుంచీ వచ్చిందనుకోరు." అన్నాడు.

"నిజం చెప్పావు అశోక్! మన సమాజంలో చాలామంది పైపై ఆకారం మాత్రమే చూస్తారు. హాస్పిటల్ లో ఆడవాళ్ళని చూడగానే నాకు అదే అనిపించింది. నైటీలు వేసుకుని, గుండ్లు చేసుకుని కనబడుతుంటే అందరూ పిచ్చిదనే అంటారు. అలాంటి వాతావరణంలో ఏనాటికీ స్వస్థత చిక్కదేమో! మనిషి శుభ్రంగా ఉంటే ఇరుగుపొరుగు వారు పలకరిస్తారు, మాటలు కలుపుతారు. కొంతకాలానికి మామూలు మనిషి కావటానికి అవకాశం ఉంది. ఆ డాక్టర్ ఈమె బ్రతకదు అని ముందే చెపుతూంటే నాకు చాలా కోపం వచ్చింది. ఆ మాటలు ఎదుటివారిలో వ్యతిరేక భావాన్ని కలిగించి, బ్రతుకు మీద ఆశని చంపేస్తుంది".

"అంతేకాదు యామినీ! మనలో చాలామంది స్వేచ్ఛా జీవితానికి అలవాటు పడిపోయారు. ఏ కొంచెం అనారోగ్యం కనిపించినా వదిలించుకోవాలని చూస్తారు. జాలి, దయ అనే మాటలే మర్చిపోతున్నారు"

"అవును. సంజనని ఇంకెవరైనా మంచి డాక్టర్‌కి చూపిద్దాం అశోక్! నాకెందుకో సంజు తప్పకుండా మామూలు మనిషి అవుతుందని గట్టిగా అనిపిస్తోంది"

"అలాగే! నీ ఇష్టప్రకారమే చేద్దాం"

"థాంక్యూ అశోక్" సంతోషంగా అన్నది యామిని.

అన్నట్టు గానే యామిని, అశోక్ కలసి ఇంకో సైకియాట్రిస్ట్ ని కన్సల్ట్ చేసారు. ఆయన రాసిచ్చిన మందులు సక్రమంగా వాడే బాధ్యత లక్ష్మికి అప్పగించింది యామిని. ఆఫీస్ కి వెళ్ళేటప్పుడు, వచ్చిన తర్వాత తప్పనిసరిగా ప్రతిరోజూ కొద్దిసేపు సంజనతో మాట్లాడేది. ఇరుగుపొరుగు వారు వచ్చి ఈమె ఎవరు అని అరా తీశారు. యామిని వాళ్ళకి సంజుని గురించి ఎక్కువగా చెప్పకుండా, తన స్నేహితురాలనీ, ఆరోగ్యం బాగాలేదనీ చెప్పింది.

నెలరోజులు గడిచేసరికి వాడే మందుల ప్రభావం వల్లనైతే నేమి, యామిని చూపిస్తున్న ఆదరాభిమానాల వల్ల నైతేనేమి సంజన మెల్లగా మనుషులలో పడింది. చెప్పిన పని విని, చెప్పినట్లు చేస్తుంది. సంజన చేత కూరగాయలు కట్ చేసి ఇవ్వటం లాంటి చిన్నచిన్న పనులు చేయించేది. ఆలోచనలో పడి ఏదో ఆలోచిస్తూ కూర్చోకుండా పుస్తకాలు చదవమని ఇచ్చేది.

● ● ●

రెండు సంవత్సరాలు గడిచాయి. సంజన మామూలు మనిషి అయింది. సంజన భర్త దగ్గర ఉన్నప్పుడే ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేసింది. యామిని సంజనని దగ్గరలోని కాన్వెంట్ లో టీచర్ గా చేర్పించింది. సంజన జరిగిన విషయాలన్నీ చెప్పింది. "నాకు చదువుకోవాలనే కోరిక బాగా ఉండేది. కానీ నా తల్లిదండ్రులు వాళ్ళ బాధ్యత తీర్చుకోవటానికి పదవ తరగతి అవగానే పెళ్ళి చేశారు. మా నాన్నకి అప్పటికే ఆరోగ్యం బాగా లేదు. ఆయనని బాధ పెట్టటం ఇష్టంలేక పెళ్ళి అయిన తర్వాత చదువుకోవచ్చని, పెళ్ళికి ఒప్పుకున్నాను. నా భర్త ఎక్కువగా చదువుకోలేదు. నేను చదువుకుంటే తను చెప్పినట్లు విననేమో అనే ఇన్ఫీరియారిటీతో వద్దని అనేవాడు. అయినా పట్టుదలగా చదువుతుంటే తిట్టి, కొట్టేవాడు. అత్తగారు అతనికి వంత పలికేది. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి కొట్టేవారు. అప్పుడు నాకు చిన్న వయసు అవటంవల్ల, నన్ను ఎందుకు నిష్కారణంగా ఎందుకు కొడుతున్నారో అర్ధంకాక ఏడుస్తూ కూర్చుంటే "పిచ్చిది, పిచ్చిది" అనేవారు. ఇరుగుపొరుగు వారికి కూడా పిచ్చి ఎక్కిందని చెప్పేవారు. చుట్టుపక్కల వారు నన్ను వింతగా చూసి, వెలి వేసినట్లు ఉండేవారు. రానురాను నాకు ఏ పని చేయవచ్చో, ఏ పని చేయకూడదో అర్థం అయ్యేది కాదు. ఒకరోజు తలమీద రోకలిబండ తో కొట్టాడు. స్పహ తప్పి పడిపోయాను. తెలివి వచ్చి చూసే సరికి పిచ్చాసుపత్రిలో ఉన్నాను. భయంతో పారిపోవాలని చూస్తే అక్కడి వాళ్ళు బలవంతంగా పట్టుకుని మత్తు ఇంజెక్షన్ ఇచ్చేవారు. గుండు చేసారు. చీర తీసి నైటీ వేసారు. క్రమక్రమంగా వాళ్లకి ఎదురుతిరగటం మానేసాను. యామినీ! చీకటి నిండిన నా జీవితంలో చిరుదీపంలా నువ్వు వచ్చావు. నా బ్రతుకులోకి వెలుగు తెచ్చావు. నేను ఈరోజు ఒక మనిషిలా బ్రతుకుతున్నానంటే నీ మంచి మనసు వల్లే! హాస్పిటల్ లోనే ఉన్నట్లయితే అనామకంగా కన్నుమూసే దానినేమో! నీ రుణం తీర్చుకోలేను" చెప్పటం ముగించింది సంజన.

సంజన కథ వింటుంటే యామిని కళ్ళ వెంట నీళ్ళు కారాయి. కళ్ళు తుడుచుకుంది. "నీ జీవితం ఇంకా బాగుండాలి సంజూ! తప్పు చేసిన వారికీ శిక్ష పడాలి" అన్నది యామిని.

ఆ మర్నాడు అశోక్, యామిని, సంజన లాయర్ దగ్గరికి దారితీసారు.

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్





- టామ్ అండ్ జెర్రీ యానిమేషన్ చిత్రం సృష్టికర్తలు విలియమ్ హన్నా, జోసెఫ్ బార్బెరా.1940లో ఈ చిత్రాన్ని రూపొందించారు.
- 1995 వచ్చిన పోకెమోన్ చిత్ర సృష్టికర్త సతోషి తజిరి.
- జో రుబి, కెన్ స్పియర్స్ స్కూబిడూ 1969లో స్కూబీడూని రూపొందించారు
- అలాడిన్ యానిమేషన్ చిత్రాన్ని వాల్ట్ డిస్నీ టెలివిజన్ సంస్థ 1994 రూపొందించింది
- టెడ్ టర్నర్, ఫిల్ హార్నేజ్, బార్బరా పైలి, రోబర్ట్ లార్కిన్‌ల ద్వారా 1990లో సృష్టించిబడిన చిత్రం కెప్టెన్ ప్లానెట్.

కదిలే బొమ్మల కథ

తెలుసా

- ఎలాంటి కదలిక లేని చిత్రాలని తెరపై వెంటవెంటనే ప్రదర్శించడం ద్వారా వాటిని కదిలే చిత్రాలుగా సృష్టించే ఓ ప్రక్రియ యానిమేషన్.
- 1892లో ప్యారిస్‌లోని గ్రివిన్ మ్యూజియం వద్ద చార్లెస్ ఎమిలి రెనాడ్స్ ఇచ్చిన మొదటి బహిరంగ ప్రదర్శన 'థియేటర్ ఆప్టిక్' సంస్మరణార్థం అంతర్జాతీయ యానిమేషన్ డేని నిర్వహిస్తారు.

- అంతర్జాతీయ యానిమేషన్ డే సందర్భంగా 50 దేశాలలో యానిమేషన్ చిత్రాల ప్రదర్శన, కళారూపాల ప్రదర్శనలతోపాటు స్క్రీనింగ్, వర్క్‌షాప్ వంటి వెయ్యికిపైగా ఈవెంట్స్‌తో నిర్వహిస్తారు.



- చేతితో గీసిన బొమ్మలు పెయింటింగ్ ఆధారంగా తొలి యానిమేషన్ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. వీటిని సెల్-యానిమేషన్ చిత్రాలుగా పిలిచేవారు. సాంకేతిక అభివృద్ధి ద్వారా నేడు ఈ చిత్రాలని కంప్యూటర్స్, ల్యాప్‌టాప్‌లలో సృష్టించడం సాధ్యపడుతోంది.
- మొదటి యానిమేటెడ్ చిత్రాన్ని స్టార్ట్ బ్లాక్టన్ రూపొందించారు. 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్' పేరుతో 1906లో ఈ చిత్రం విడుదలైంది.
- విభిన్న రూపాల్లో ఉన్న కళలు, సినిమాలని గుర్తించేందుకు యుఎన్ సభ్యత్వ సంస్థ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అసోసియేషన్ ఫ్రాన్స్‌లో స్థాపించబడింది. యానిమేషన్ పై పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా 2002లో ఈ సంస్థ యానిమేషన్ డేని నెలకొల్పింది.

- సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అభివృద్ధి చెందుతున్న యానిమేషన్ కళలో ప్రజలందరూ భాగస్వాములయ్యేలా ఇంటర్నేషనల్ యానిమేషన్ డే (ఐఎడి)ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 28న ప్రపంచ వార్షిక వేడుకగా జరుపుకుంటారు.
- టీవీ సిరీస్, సినిమాలుగా వచ్చిన యానిమేషన్ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది పిల్లల్ని ఆకట్టుకున్నాయి.



- 'ది పవర్ పఫ్ గార్ల్స్'ని 1998లో క్రెయిగ్ క్రాకెన్ సృష్టించారు.
- మొట్టమొదటి కంప్యూటర్ యానిమేటెడ్ చిత్రం టాయ్‌స్టోరి 1995లో విడుదలైంది. ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ డాలర్ కంటే ఎక్కువ వసూలు చేసిన యానిమేటెడ్ చిత్రం టాయ్ స్టోరీ-3.



కొత్త పుస్తకాలు

ఆమె ధిక్కార స్వరం

జీవన కోలాహలంలో తొణికిసలాడే
తడిలా... ఆమె
విత్తు నుంచి మొలిచే మొక్కలా
ప్రశాంతంగా... ఆమె
ఎదుగుదలే ధ్యేయంగా... ఆమె
మౌనం దాల్చిన శతాబ్దాల నిశ్శబ్దం... ఆమె
ఆంక్షల అగ్నిగుండాల్ని దాటుకుంటూ ప్రతిఘటించి
పోరాడుతున్న ధిక్కారం... ఆమె...

'తడి ఆరని దుఃఖం' కవిత్వం కాదు.... 'ఆమె' అంతరంగం. 'ఆమె' అంతరంగంలోని అంతర్మథనాన్ని, అక్షరాలుగా పేర్చి... కవిత్వంగా మార్చి... గుండెలోతుల్లోని తడిని సుతిమెత్తగా తట్టి... సునామీలా ఆవిష్కరించారు కవయిత్రి భండారు విజయ. ఈ పుస్తకంలోని 54 కవితలు... ఒక్కోటి ఒక్కో జీవన దృశ్యాన్ని, వ్యథార్థ జీవితాన్ని, చైతన్య వీచికలను ఆవిష్కరిస్తాయి.

ఈ కవితల సంకలనంలోని ప్రతి అక్షరంలో 'ఆమె' అంతర్మథనం... 'తడి ఆరని దుఃఖం' కనిపిస్తుంది. దుఃఖం, ఆవేదన, ఆర్ద్రత, ధిక్కారం, ప్రతిఘటన విజయ కవిత్వం నిండా కనిపిస్తుంది. రోహిత్ వేముల తల్లి ఆక్రందన, నన్ను ఇప్పుడైనా మాట్లాడనివ్వండి అంటూ... 'న్యాయానికి అయిన గాయానికి' చికిత్స చేయమంటూ నిర్భయ చేస్తున్న డిమాండ్, పోలవరం ఆత్మఘోష,



తడి ఆరని దుఃఖం
రచయిత : భండారు విజయ
పేజీలు : 152, **వెల :**150/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్ హైదరాబాద్, నవతెలంగాణ, ప్రజాశక్తి, నవ చేతన, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు, పబ్లిషింగ్ హౌసుల అన్ని బ్రాంచీలు

ముజఫర్‌నగర్ అల్లర్లలో బాధితుల వేదనాభరిత జీవితం ఈ కవిత్వం నిండా చిక్కగా పరుచుకొనివుంది. 'విశాల ప్రపంచం వైపు' కవితలో 'మానవ సంబంధాలన్నీ/ రెక్కలు విప్పిన పక్షులై/ ఏ చెట్టుపై వాలుతాయో/ గాలివాటానికి ఎటు ఎగిరిపోతాయో/ విరిగిన బంధాలకు/ ఓడిపోయిన అనుబంధాలకు/ ఆశల లేపనాలు పూస్తూ/ ఒంటరిగా మిగిలిపోయిన ఆమని... ఆమె' అంటూ... అనాదిగా విరిగిపోయిన మానవ సంబంధాలకు ఆశల లేపనాలు పూస్తున్న వైనాన్ని అద్భుతంగా కవిత్వీకరించారు. 'తలకట్లు- దీర్ఘాలు/ వత్తులు- గుడింతాలు/ అన్నీ... మాకేనా?/ ఏ గుడింతాలు మీకవసరం లేదా?' అంటూ ఆచార వ్యవహారాల ఆంక్షల్ని ప్రశ్నిస్తూనే 'మాసంకెళ్లను తెంపుకొని/ నరికివేయబడిన కాళ్ల చేతులను/ అతికించుకుంటున్నాం/ ఇక నీ ఆటలు సాగనివ్వం' అంటూ ధిక్కార స్వరాన్ని ధాటిగా వినిపిస్తారు. 'వందల వేల సంవత్సరాలుగా/ అనేక గోడల మధ్య/ నిర్బంధించబడిన గొంతుకలమై/ ఉనికిని కోల్పోయిన మేము/ ఆంక్షల పంజరాలను/ తునాతునకలు చేస్తున్నాం' అంటూ 'మా.. మాట' కవితలో గర్జిస్తుంది. అదే సమయంలో 'జోహార్లు! సాయికృష్ణ' కవితలో అమ్మలోని మమకారాన్ని, బిడ్డ దూరమైతే అమ్మ పడే ఆవేదనను హృద్యంగా కళ్లకుగట్టారు. 'ఒక చేత్తో చీపురుకట్ట/ మరో చేత్తో ఓ అట్టముక్కతో/ దివిటీ మోసే దీపకన్యగా/ తారురోడ్లను తడుముకుంటూ/ పనిలో తాను మునిగిపోతుంది' అంటూ 'జాగరూకత' కవితలో పారిశుధ్య కార్మికురాలిని దివిటీని మోసే దీపకన్యగా అభివర్ణిస్తుంది.

ఈ మొత్తం కవిత్వంలో కవయిత్రి బతుకు వేదననంతా ఏకరువు పెడుతుంది... ఆవేశంగా ప్రశ్నిస్తుంది... ఆగ్రహంతో ఊగిపోతుంది.... చైతన్యాన్ని రగిలిస్తుంది. ఈ కవితలను సమీక్షించడానికి ఒక పేజీ చాలదు... ఈ నాలుగక్షరాలూ చాలవు. హృదయం కావాలి. స్పందించే మనసుండాలి.

- రాజాబాబు కంచర్ల

కన్నీరు పెట్టించిన కథ

ప్రమీల- డా॥ సామాన్యల సంపాదకత్వంలో వెలువడిన 'ప్రాతినిధ్య - కథ 2015'లో మొదటి కథ 'కట్ట'. రచయిత్రి వినోదిని. గుంటూరు జిల్లాలో రెల్వేలైను పక్కన గల ఒక పల్లెటూరు కథావేదిక. స్వరూప అనబడే ఇంటర్మీడియట్ విద్యార్థినికి సెలవులకు స్వంతవూరు వెళ్లడానికి సంతోషించడానికి బదులు గుండెల్లో గుబులు రేగుతుంది. కారణం 'తెల్లగ తెల్లవారకముందే' కడుపు బాధ తీర్చుకోవడమెట్లా అన్న సమస్య. ఇది ఒక్క స్వరూపదే గాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది మహిళలు అనునిత్యం ఎదుర్కొంటున్నదే.

'ఆరుబయట మలవిసర్జన అనారోగ్యం' అనే చిలకపలుకులకు కోట్లు వసూలు చేసుకునే విద్యాబాలన్‌కు ఆ ఆరుబయట మల విసర్జన ఎంత కష్టభూయిష్టమో అర్థం కాదు. బహిరంగ మల మూత్ర విసర్జన రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిన బూనిన ఇరు రాష్ట్రాధిపతులకూ తెలియదు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పెట్టిన మోడీ ప్రభువుకు కూడా కొత్త చీపురు పట్టుకుని ఫొటోలు తీయించుకోవడమే గాని సమస్యలోతులు అంతుపట్టవు.

దాదాపు పాతికేళ్ల క్రితం ఒక మహిళా సంఘ మహాసభలో ప్రసంగించిన తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 'ఊళ్లలో ఖాళీ జాగాలోకి దొడ్డికి బోయిన ఆడోళ్ల మీద రాళ్లతో కొడుతున్నార'న్నప్పుడు ఆమె మాటల్లో భూస్వాముల దాష్టీకమే చూశాం గాని ఆ మహిళల అగచాట్లు గుర్తించలేకపోయాం.

ఇటీవల ఒక నెలరోజుల క్రితమే మా అల్లుడితో పిచ్చాపాటీ మాట్లాడుతున్నప్పుడు మా ఊళ్లో క్రొత్త అల్లుడితో పాలేరు చెంబునీళ్లతో నడవడం గురించి చెప్పుకుని కడుపుబ్బ నవ్వుకున్నాం.

కాని వినోదిని ఈ సమస్యను ఆసాంతం సమర్థవంతంగానే గాక ఆడవాళ్ల అవస్థల్ని కళ్లకు కట్టినట్లు వర్ణించిన తీరు మాత్రం కడు ప్రశంసనీయం.

కథలో వస్తువుకెంత ప్రాధాన్యత వుంటుందో కథనానికీ అంతే వుంటుంది. కథకు కొంత కల్పన కూడా అవసరమే అయినా వస్తువులో వాస్తవికత వుంటే అది జీవన సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. ఇంతటి సీరియస్ అంశాన్ని తీసుకున్న వినోదిని తగు మోతాదులో హాస్యాన్ని కూడా జోడించడం ఆమె రచన చాతుర్యాన్ని చాటి చెబుతుంది.

రైలు కూత వినబడక 'దొడ్డికెళ్లి రైలు క్రింద పడి చనిపోయిన చెవిటి కరుణమ్మ', చెంబొక చేత్తో, రాయొక చేత్తో పట్టుకెళ్లి గురిచూసి కరెంటు స్తంభం మీదికి రాయి ఇసిర్నాకే సత్తెనపల్లి అంజమ్మత్తల్ని మర్చిపోలేం. అవును మరి. మగాడు కనబడినప్పుడల్లా లేచి నిలబడుతూ గుంజిళ్లు తీసే అవస్థ ఆడవాళ్లకే గదా! అందుకే సమస్యకు పరిష్కారాన్ని 'అందరం చేతిలో పట్టేంత రాయి పట్టుకోవడమొక్కటే' అనే నిర్ణయానికి రాక మానం.

- వి . సుమతి

మేతి పన్నీర్ రైస్

కావాల్సిన పదార్థాలు

మెంతి ఆకులు(సన్నగా కట్ చేసుకోవాలి)- 2 కప్పులు
పన్నీర్-1 కప్పు
ఉల్లిపాయల తరుగు -1/2 కప్పు
వెల్లుల్లి రెబ్బలు -6
పచ్చిమిర్చి -2
నిమ్మకాయ-1
బియ్యం-1 కప్పు

తయారుచేసే విధానం

స్టౌపై ప్యాన్ పెట్టి నూనెవేసి వేడెక్కిన తర్వాత పన్నీర్‌ని వేసి బంగారు రంగు వచ్చే వరకు ఫ్రై చేసుకోవాలి. అదే పాన్‌లో కొద్దిగా నూనె వేసి ఉల్లిపాయ తరుగు, వెల్లుల్లి తరుగు వేసి బంగారు రంగు వచ్చే వరకు ఫ్రై చేసుకోవాలి. తర్వాత సన్నగా తరిగిన మెంతి ఆకులు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. అన్నీ వేగిన తర్వాత శుభ్రంగా కడిగి పెట్టుకున్న బియ్యం, సరిపడా నీరు, గరం మసాలా, నిమ్మరసం వేసి మొత్తం మిశ్రమాన్ని కలిపి ఉడికించాలి. అన్నం ఉడికిన తర్వాత ముందుగా ఫ్రై చేసి పెట్టుకున్న పన్నీర్ ముక్కలని కూడా వేసి మొత్తం మిశ్రమాన్ని కలుపుకోవాలి. పది నిమిషాల తర్వాత మేతీ పన్నీర్ రైస్‌ని సర్వింగ్ ప్లేట్స్‌లోకి తీసి మీకు నచ్చిన రైతాతో రుచి చూడండి.

పైనాపిల్ రైస్

కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం-2 కప్పులు
పైనాపిల్ ముక్కలు- 1 కప్పు
అల్లం తరుగు-1 టేబుల్ స్పూన్
జీడిపప్పు-10
కిస్‌మిస్-6
కారం-2 టీస్పూన్లు
ఉప్పు-రుచికి తగినంత
ఉల్లి తరుగు-2 టేబుల్ స్పూన్లు
రిఫైన్డ్ నూనె- సరిపడా
పండు మిర్చి తరుగు- 1 టేబుల్ స్పూన్
వెల్లుల్లి తరుగు-1/2 కప్పు
బీన్స్ తరుగు-1/2 కప్పు
క్యారెట్ తరుగు- 1/2 కప్పు
పసుపు- చిటికెడు
మిరియాల పొడి-1 టేబుల్ స్పూన్
నిమ్మరసం-1 టేబుల్ స్పూన్



తయారుచేసే విధానం

ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి పలుకుగా ఉడికించుకోవాలి. చల్లారిన తర్వాత కొద్దిగా నూనె వేసి, అన్నం ఆరబెట్టాలి. తర్వాత స్టౌపై ప్యాన్ పెట్టి పోపుకు సరిపడా నూనె వేసి అందులో వెల్లుల్లి తరుగు, పండుమిర్చి తరుగు, బీన్స్, క్యారెట్ తరుగు వేసి వేయించుకోవాలి. తర్వాత పోపు గింజలు, ఉప్పు, కూరగాయ ముక్కలు, కారం, అన్నం, పసుపు, పైనాపిల్ ముక్కలు వేసి బాగా కలుపుకోవాలి. మరో ప్యాన్‌లో జీడిపప్పును వేయించుకోవాలి. ఇప్పుడు పైనాపిల్ మిశ్రమంలో నిమ్మరసం వేసి కలిపిన తర్వాత పెప్పర్, ఉల్లితరుగు, కిస్‌మిస్, వేయించిపెట్టుకున్న జీడిపప్పులతో గార్నిష్ చేసి అతిథులకందించండి.

గోబీ ఫ్రైడ్ రైస్

కావాల్సిన పదార్థాలు

కాలీఫ్లవర్ -2 కప్పులు
రైస్-2 కప్పులు
పచ్చిబఠానీలు-1/2 కప్పు
జీలకర్ర-1/4 టీస్పూన్.
అల్లం వెల్లుల్లి పేస్ట్-1 టేబుల్ స్పూన్
గరం మసాలా-1/4 టీస్పూన్
కొత్తిమీర తరుగు-1/2 టేబుల్ స్పూన్
ఉప్పు-రుచికి సరిపడా
నూనె-తగినంత

తయారుచేసే విధానం

ముందుగా అన్నం వండిపెట్టుకోవాలి. తర్వాత స్టౌపై పాన్ పెట్టి కొద్దిగా నీరు, పసుపు, ఉప్పు వేసి అందులో కాలీఫ్లవర్ కూడా వేసి 10 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. తర్వాత నీరు వంపేసి కాలీఫ్లవర్‌ను ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. మంచి నీరుతో కాలీఫ్లవర్‌ని కడిగి నచ్చిన సైజులో కట్‌చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు మరో పాన్ తీసుకుని అందులో నూనె వేసి వేడెక్కిన తర్వాత అందులో జీలకర్ర, అల్లం, వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి, పచ్చిబఠానీలు వేసి ఫ్రై చేసుకోవాలి. ఇందులో ముందుగా ఉడికించి పెట్టుకున్న కాలీఫ్లవర్‌ని కూడా వేసి కొద్దిగా వేయించిన తర్వాత రైస్ కూడా వేసి మొత్తం మిశ్రమాన్ని ఫ్రై చేసుకోవాలి. ఈ మిశ్రమంలో గరం మసాలా, ఉప్పు వేసి మొత్తం కలిసేలా కలుపుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే కాలీఫ్లవర్ రైస్ రెడీ.

బాల నేస్తాలు



దారి కనిపెట్టండి

ఇక్కడ పాటలు పాడుతూ కనిపిస్తున్న వ్యక్తి తన గిటార్‌ని తెచ్చుకునే దారిని కనిపెట్టండి.



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక టాలీవుడ్ స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫొటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?



ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.



కనిపెట్టండి

కొండల పైనుండి కొందరు నడుచుకుంటూ వెళుతున్నట్టు గీసిన ఈ చిత్రంలో ఒక అమ్మాయి ముఖం కూడా దాగుంది అదెక్కడుందో కనిపెట్టి సున్నా చుట్టేయండి.

చుక్కలు కలపండి



పదాలు పూరించండి

ఇక్కడ తొమ్మిది బొమ్మలనుంచాం. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీలో నింపేయండే!

a e i o u



పదమూడేళ్లు... 200 ప్రదర్శనలు...

పిల్లలూ! టీవీలో మీకు ఇష్టమైన పాట వినబడగానే వెంటనే డ్యాన్స్ చేసేస్తుంటారు కదా. మీలో ఇప్పటికే కొందరు స్కూల్ ఫంక్షన్లలో రకరకాల డాన్సులతో స్టేజ్ పెర్ఫామెన్స్‌లు కూడా ఇచ్చుంటారు. అయితే మీకు 13 ఏళ్ల సైరి రహంగడే గురించి తెలుసా! ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సాలెమ్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది సైరీ. ఇంతకీ సైరీ ఏ డ్యాన్స్‌లో ఎక్స్‌పర్ట్ అనేగా మీ సందేహం. భరతనాట్యంలో ఆరితేరిన ఈ చిన్నారి భారతదేశం మొత్తం మీదా రెండొందలకు పైగా ప్రదర్శనలిచ్చింది. ఇక రాయ్‌పూర్‌లో ప్రతి సంవత్సరం నవంబర్ మొదటి వారంలో అక్కడ ప్రభుత్వం నిర్వహించే రాజ్యోత్సవ్ వేడుకల్లో సైరీ నాట్యం ఉండి తీరాల్సిందే. దేశవ్యాప్తంగా వందలాది భరతనాట్య ప్రదర్శనలివ్వడమే కాదు రోహిల్ కండ్ అవార్డు, గౌరవాత్మకమైన కళాశ్రీ, పంచరత్న, నిత్యశ్రీ అవార్డుల్ని గెలుచుకుంది సైరి. చిన్నారులందరూ బుడి బుడి అడుగులేసే నాలుగేళ్ల వయసుకే సైరీ లయబద్ధంగా డ్యాన్స్ చేస్తుండటాన్ని గమనించిన తల్లిదండ్రులు ప్రకాశ్, మీతా రహన్‌గ్డలే. అప్పటి నుండి భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న సైరీ స్కూల్‌లో నిర్వహించే అన్ని డాన్స్ పోటీలతో పాటు దేశవ్యాప్తాంగా నిర్వహించే భరతనాట్యం పోటీలు, స్టేజ్ ప్రదర్శనల్లో పాల్గొనేది. అద్భుత ప్రతిభతో ఎన్నో పతకాలు సాధించిన సైరిని బాలమేధావిగా పరిచయం చేయడం కంటే గొప్ప మనసున్న చిన్నారిగా పరిచయం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే తన డ్యాన్స్ ఫెర్ఫార్మెన్స్‌ల ద్వారా వచ్చిన

డబ్బు మొత్తాన్నీ తన కోసం కాకుండా మురికివాడల్లో నివసించే పిల్లల పుస్తకాలు, విద్యకు ఉపయోగిస్తుంది. అంతే కాదు తను శిక్షణ పొందిన భరతనాట్యాన్ని వీరికి ఉచితంగా నేర్పుతుంది. తరచు వృద్ధాశ్రమాలకి వెళుతూ తన డ్యాన్స్‌తో వారిని మెప్పించడంతో పాటు వారికి ఆర్థికసాయాన్ని అందజేస్తోంది. పండుగ సమయాల్లో వృధా కర్చులన్నిటినీ తగ్గించుకుని ఆ డబ్బుని కూడా అవసరంలో ఉన్నవారికి అందిస్తుంటుంది సైరి కుటుంబం. భరత నాట్యంతో పాటు శాస్త్రీయ సంగీతంలో డిప్లొమా చేస్తున్న సైరి భవిష్యత్తులో మెడిసిన్ పూర్తిచేసి డాక్టర్‌గా పేదవారికి సాయపడాలనుకుంటోంది.

పదవికాసం - 36

కూర్పు: రావెళ్ల

1		2	■	3		4		5
	■		■		■		■	
6		■	7			■	8	
	■	9	■		■	10	■	■
11				■	12			13
■	■		■	14	■		■	
15		■	16			■	17	
	■	18	■		■	19	■	
20					■	21		

ఆధారాలు

అడ్డం

1. కృష్ణా జిల్లా ముఖ్య పట్టణం(3)
3. కోరిందల్లా ఇచ్చే వృక్షము(5)
6. హిందీలో 'ఆహా' తిరగబడింది (2)
7. దుఃఖించి (3)
8. ఫ్యూజు వైరులో వాడే లోహం(2)
11. ఎత్తు నుండి కిందికి వేగంగా జారే నీరు కుడి నుండి ఎడమకు(4)
12. ఎల్లప్పుడూ ప్రవహించే నది గజిబిజిగా(4)
15. ....మింగిన వెలగపండు అంటుంటారు(2)
16. రాజకీయ నాయకులు దీని కోసం పాకులాడు తుంటారు (3)
17. పెన్నులో ఇది పోసి రాయాలి(3)
20. ఇల్లు కట్టడానికి ముందు పునాది తీసి చేసేది(5)
21. ఆభరణాలు(3)

నిలువు

1. అల్ప పీడనాలకు నెలవైన సముద్రం (5)
2. అప్పు (2)
3. చూసి, పర్వతము అనే అర్థాలు వచ్చే ఒక ఊరు(4)
4. డెవలప్ క్లుప్తంగా(2)
5. ఒక దుంప (3)
9. అలసి పోవడం(3)
10. పెళ్లికి ఇంటి ముందు వేసేది(3)
13. భూమిపై నున్న జీవులను కలిపితే(5)
14. సుందరమైన (4)
15. 'శంకల'లో పాత్ర(3)
18. హిందీలో సభ(2)
19. వర్షం (2)

సుడోకు

9	2	4						3
	5	7	8	1				
		8		2	4			7
	7	3			5		4	9
6	1	5				3	7	8
4	9		7			1	5	
7			5	8		9		
				9	1	7	3	
5						6	8	1

గతవారం జవాబులు

3	2	8	5	4	9	1	6	7
4	7	5	3	1	6	2	8	9
6	9	1	2	7	8	3	4	5
7	1	6	8	9	2	4	5	3
2	3	9	6	5	4	7	1	8
5	8	4	7	3	1	9	2	6
8	4	2	9	6	3	5	7	1
9	6	7	1	2	5	8	3	4
1	5	3	4	8	7	6	9	2

1 పా	య	2 సం	■	3 ఐ	శ్వ	4 ర్యా	రా	5 య్
ద	■	ఖ్య	■	ద	■	మి	■	భా
6 ర	త్నం	■	7 పా	వ	8 నం	■	9 కా	దు
క్ష	■	10 తా	ము	■	11 ది	12 య	■	■
13 ఉ	దా	వ	■	14 ద్యం	■	15 శో	య	16 గ
■	■	17 సం	18 ధ్య	■	19 ఎ	ద	■	డ్డి
20 దం	డి	■	21 విం	22 దు	కు	■	23 నా	ప
డి	■	24 మ	■	మా	■	25 నె	■	ర
26 క	న	కాం	బ	రం	■	27 ల	తి	క

ఒంటరి పాండా

ప్రపంచంలోనే ఏకైక బ్రౌన్ పాండా ఇది. పాండాలు నలుపు-తెలుపులో ఉంటాయి. కానీ ఇది గోధుమ-తెలుపుల్లో ఉంటుంది. ఆ ప్రత్యేకత వల్లే రెండు నెలల పసికందుగా ఉన్నపుడే దీన్ని తల్లి వదిలేసింది. మిగతా పాండాలు దీన్ని తమలో చేర్చుకోలేదు. అలా ఒంటరైపోయిన ఈ బుజ్జి పాండాను జంతు సంరక్షకులు చైనాలోని ఫోపింగ్ పాండా వ్యాలీకి తరలించారు. అక్కడ కూడా సాటి పాండాలు దీనితో స్నేహం చేసేవి కావు. దీని ఆహారాన్ని లాగేసుకుని నానా ఇబ్బందులు పెట్టేవి. అందుకే దీని మంచి చెడులు చూసుకునేందుకు ఓ సంరక్షకుణ్ని నియమించారు. అప్పటి నుంచి దీని పరిస్థితి కాస్త మెరుగైంది. స్నేహితుడు దొరికాడు. ఇన్నాళ్లు విచారంగా, బద్ధకంగా, ఒంటరిగా తిరిగిన దీనికి ఇప్పుడు ఎక్కడలేని సంతోషం కలుగుతోంది. ప్రస్తుతానికి ఏడేళ్ల వయస్సుకు వచ్చిన ఈ పాండా రంగుకు కారణం జన్యుపర మార్పులై ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

ఫ్రెస్కో వీధుల్లో...

అంతెత్తు భవంతులపై నిలువెత్తు ఫ్రెస్కోలు ప్రాణం పోసుకుంటే..! కైన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నగరం గోడలపై ఆరాధ్య తారలు హాజరవుతారు. నిర్మానుష్యంగా కనిపించే సొరంగ మార్గాల్లో అలజడి కలుగుతుంది. మోడుబారిన భవంతి దేహాలపై కేరింతలు హత్తుకుంటాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చిత్తరువుల్ని అద్దేసే ఫ్రెస్కో కళను భవంతి బయటకు అల్లించాడు ఫ్రెంచ్ వీధికళాకారుడు ప్యాట్రిక్ కొమ్మెనీస్. ఫ్రాన్స్, స్విట్జర్‌ల్యాండ్, ఇటలీ లాంటి దేశాల్లో ఇలాంటి వందలాది పెయింటింగ్‌లతో భవంతుల గోడలపై అందాన్ని ఒద్దికగా అద్దేస్తున్నాడు. పొందికగా వీధుల్లో సర్దేస్తున్నాడు. ఓ తరహా కుడ్య చిత్రాలుగా కనిపించే వీటిలో సన్నివేశాలన్నీ జీవాన్ని నింపేసుకుని ఉంటాయి. పాతరోజుల్లోకి, కొత్త తలపుల్లోకి విహరింపజేస్తాయి. ఈ ఫ్రెస్కో కళలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న ప్యాట్రిక్ తన బృందంతో వీధుల్లోకి ఊహల్ని ఎలా లాక్కొచ్చాడో చూడండి.